ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక -

సంపుటి-44 మన్మథ సంవత్సరము - మార్గశిర - పుష్య మాసములు - సంచిక 3-5

శ్రీ

ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక

(Journal of the Telugu Academy)

చందా సంవత్సరమునకు మూఁడు రూపాయలు 5

సంపుటము ౪౪ { మన్మథ సంవత్సరము / మార్గశిర-పుష్యమాసములు } సంచిక

స్మృతులు

1

శ్రీ గొట్టుముక్కల రామకృష్ణశాస్త్రిగారు 21—1—56 తేది రాత్రి (మన్మథనామ సం॥ మార్గశిర శుద్ధ అష్టమి) పదిగంట వఱకు మిత్రులతోఁ గవితాగోష్ఠిచేసి యా రాత్రియే యాకస్మికముగ దివంగతులైనా రని విని నిలువున నీరయిపోతిమి. ఇంతకు నలువది నాల్గు సంవత్సరములుకూడ నిండలేదు. వీరి యకాలమరణ మాంధ్రులక గుండెపైఁ బిడుగని వేఱే చెప్పనక్కఱలేదు.

శ్రీరామకృష్ణశాస్త్రిగారికి వైద్యము కులవిద్య. కవిత్వము వెన్నతోఁ బెట్టినది. ఈ రెంటను వీరు సిద్ధహస్తులు. శరీరమునకు, ఆత్మ కుఁగూడ నానందము గూర్చు రససిద్ధులు.

శ్రీరామకృష్ణశాస్త్రిగారు కవులు; పండితులు; ప్రతిభా వ్యుత్ప త్తులు రెంటను సపాళ్లుగఁ బుణికి పుచ్చుకొన్న ధన్యజీవులు. తన్మ యత—రసార్ద్రిత వీరి సహజగుణములు. అందుండి 'త్వమేవాహం త్వమేవాహ' మని కవితావాగ్దేవి యవతరించినది.

శ్రీరామకృష్ణశాస్త్రిగారి యష్టావధాన, శతావధాన,రంగములు రసతరంగములు, ఆశుధార కమ్మచ్చున లాగినట్లు తీరువడి ముక్క తిమ్మనార్యుని 'నభోవాయునిహతిని మొరయు మహతి'ని దలఁపించెడిది.

వీరి చెలిమికలిమిచే మా పరిషత్సభానమావేశము లోక నిండుదన ముసు జూఱగొన్నవి. వీరి యకాలమరణముచే మా పరిషత్తు దరిద్రాణ మయ్యెనని వగచుచున్నాము.

వీరికవన మెంత సరసమో కంఠ మంత మధురము. వారి కావ్యసారస్యముతోపాటు వారికంఠమాధుర్యముకూడ నేఁటికిని మా శ్రుతులయందుఁ బ్రతిధ్వనించుచున్నది.

శ్రీ రామకృష్ణశాస్త్రిగారు ఋషి. అరుణాశ్రమము వీరి కవితా తపోవనము. ఇది కేవలము వీరు తమయుపాసనాస్థితికిఁ బెట్టికొన్న పేరు. 'నడకుదురు' గ్రామము. (తోట్రుపాటు లేని నడతీరుకలది). ఆశ్రమశబ్దమున కిదికూడ సాకూతముగ జతపడినది. 'పవిత్రసారస్వతోపాసన' దీని ముఖ్యలక్ష్యము. తమ శ్రావణకావ్యనివేదనమున వీరు 'కవి విశ్వసారథి' యని యుగ్గడించియున్నారు. అరుణాశ్రమములోని యరుణశబ్దమున కిది యర్థద్యోతక మగుచున్నది. అరుణుఁడు విశ్వసారథి; కవికూడ నంతే. అరుణుఁడు తేజోరాశిని వెంటఁబెట్టికొని దిగంతము లుద్దీపితము చేయును. కవికూడ నంతే. అరుణుని యనూరుత్వము, ఏకచక్రరథత్వము కవి స్థితిగతులను స్ఫురింపఁజేయుచున్నవి. శ్రీ రామకృష్ణశాస్త్రిగారి కవితో పాసన యిట్టి స్థాయిలోఁ బ్రారంభమైనది.

వెలువడిన వీరి కృతులు రెండు. అవి కుంతి, శ్రావణము. కుంతి తొలిసారిగ శ్రీ రామకృష్ణశాస్త్రిగారి కళాప్రాభవమును పాఠకులకుఁ బరిచితముఁ జేసినది. ఇది చిన్నదైనను జాల యపూర్వరచన. ఎందఱెందఱో మహాకవులయు పండితులయు ప్రశంస లందికొన్నది. శ్రావణముకూడ నంతే. ఇది శ్రీరామకృష్ణశాస్త్రిగారు సజీవులై యున్న తమ వృద్ధమాతాపితల కంకితముచేసినారు. పురాణదంపతులఁబోలు వారి ఛాయాచిత్రముకూడ భక్తితోఁ గావ్యముఖమున నీయఁబడినది. ఈ యంకితవిషయము నిట్లు వ్రాసియున్నారు:—

మ. అరుదారన్ బితృపాదపంకజ సపర్యాలక్షితం బైన సుం
దరచారిత్రము గావ్యరూపమున సంధానించి విద్వత్సమా
దరణీయమ్ముగ బవిత్రమై తనరు తత్కావ్యప్రసూనోత్తమం
బరుదారన్ బితృపాదపంకజసపర్యార్థంబె యోజించెదన్.

పితృభక్తిచేగాక మాతాస్మృతినిగూడ శ్రవణుని దలపించుచున్న శ్రీరామకృష్ణశాస్త్రిగారు తమ కావ్యవర్ణితమైన వృద్ధదంపతుల పుత్రశోకమును బునఃపాకంబునకు దెచ్చి మాతాపితల హృదయములలో గరుణరసమును బుటములు పెట్టుచున్నారు—

మ. కొడుకా! యంచు మహోచ్చకంఠముల నాక్రోశించి యాపీన్గుపైం
బడి దోగాడుచు నెత్తిమోదుకొని యాపాదంబు నామస్తముల్
వడకుంజేతుల సంస్పృశించుచు మహాబాష్పప్రపూరంబు మైం
దడుపన్ బోరున నేడ్చి రెంతయును బుత్రప్రేమ నాదంపతుల్.

శా. ఈ రత్నంబు లభించునంతటిమహాదృష్టంబు..................
....................................నీవంటి వి
స్తారప్రజ్ఞుడు నెట్లుదక్కును? తటిత్ప్రాయమ్ము గా జీవితా
శారూపం బయి వెల్గె నీవెలుగు నిష్కాంతంబు సయ్యెన్ ద్రుటిన్

ఈ శోకము కావ్యమున రసము కావచ్చు. జీవితమున దుర్భరము.

నీలకంఠవిజయము, మృచ్ఛకటికము, అద్భుతదర్పణము, నాస్వామి, తుపాను, మొదలగు కృతు లెన్నియో శ్రీ శాస్త్రిగారు రచించినారు. ఇవి యముద్రితములు. 'నాస్వామి'లోని కొన్నిపద్యములు మా పరిషత్పత్రికలో బడినవి.

ఈ మధ్య శ్రీ శాస్త్రిగారు 'శ్రీ వేంకటాచల మాహాత్మ్యము' (తిరుపతి ప్రచురణము) అను సంస్కృతగ్రంథము నాంధ్రీకరింపబూనినారు. ఇందలి కొన్నిఘట్టములు వారు మాకు వినిపించినారు. ఇందు

వాగర్థరూపు లగు పురాణ దంపతులయందు వారి కళాస్వరూపమైక్య మొందిన దని చెప్పుట యత్యుక్తి కానేరదు. ఆంధ్రుల దురదృష్టము— అది పూర్తికాకపూర్వమే వారు చిత్కళాసాయుజ్యము నొందినారు.

2

శ్రీ వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రిగారు 9-2-56 తేదీ రాత్రి పరమ పదించినారు. వీరిమరణమున కాంధ్రసాహిత్యపరిషత్తు చాల విచారము నందినది. శ్రీ శాస్త్రిగారు సంస్కృతాంధ్రములలో పండితులు. భాషాభిమానులు. గ్రంథోద్ధారకులు. కవిపోషకులు. అగణితము లగు ప్రాచీనార్వాచీన సంస్కృతాంధ్రగ్రంథముల ముద్రించి యుభయ భాషలకు నపారమైన సేవచేసినారు.

శ్రీ శాస్త్రిగారి షష్టిపూర్త్యుత్సవ సందర్భమున వీరి సంస్కృతాంధ్రగ్రంథసేవాకృషిని ప్రశంసించి శ్రీ రామలింగారెడ్డి ప్రభృతులు వీరికి 'భాషోద్ధారక' అని బిరు దిచ్చియున్నారు. సమ్మాన సంపుటము పేరితో నొక గొప్ప సంపుటముకూడ వెలువడినది. క్రిందటి స్నాతకోత్సవములో, ఆంధ్రకళావిశ్వపరిషత్తువారు "కళాప్రపూర్ణ" అని బిరుదు నొసఁగి సత్కరించినారు. ఈ బిరుదములకు శ్రీ శాస్త్రిగా రెంతయుఁ దగియున్నారు.

నిరంతర భాషాసేవతోఁ దమ జీవితమును సార్థకపఱచుకొన్న శ్రీ శాస్త్రిగా రాంధ్రులకుఁ జిరస్మరణీయులు. పరమాత్ముఁడు వారి యాత్మకు శాంతిని ప్రసాదించుఁగాత.

ఆవేదనము

వద్దిపర్తి చలపతిరావు

క॥ ఎడఁబాసిపోయినా వని
నుడి నుడిగొని చెవినిసోఁకి నూల్కొను కలఁతల్
గడిసిలఁబడె గుండియ, త
ల్లడపడెఁ గాల్ సేయి, చతికిలంబడిపోతిన్.

మ॥ ఒడికంబై యొదుప్పైన యెత్తుగడతో
నొయ్యారముల్ గుల్కు పో
కడతో, ఏ గుణరీతివృత్తులకు నం
కాహాంకముల్ లేని మేల్
నుడికారంబులపొందు పీనులకు విం
దుల్ సేయ నీ కైతకున్
గుడి కట్టించితివోయి పాఠకమనః
కూటంబులన్ ధీనిధీ.

ఉ॥ వ్యాసుని భారతంబున నొ
కంతలుగా నణఁగారియున్న దా
ర్వానస మంత్రమోహామతు
రాలి దశాంతర చిత్తవృత్తి ని
శ్వాసము లేర్చి యొక్క రస
వంతపుఁ బాత్రగఁ దీర్చినావు, నే
బా నసిపింపఁగాఁ దెలుఁగు
బాసను మూసను బోసినావులే.

ఉ॥ మోసులువాఱ నీ తెలుఁగు
భూము లొరిగిన్ గవితారసాల శా
ఖా సముపస్థితిన్ మధుర
గానము సేసితి వింత, పాము కా

చేసినయట్లు మాఱుపలు
కే కొనరింపని నోరి వెంబడిన్
మూసిన యా కనుల్ దెఱవఁ
బో వికఁ; జావుకుఁ జావు లేదటే.

శా॥ నీ మాతాపితలందు నీకుఁ గల యా
నిర్ణిద్ర మా భక్తి మో
హై మాటుంగొని తీవ్ర 'శార్వణము' కా
వ్యంబందు నాలెమ్ము నాఁ
డా మాఁగ్రొన్మగిన వృద్ధదంపతుల హా
హాకారముల్ నేఁడు క
ట్టా! మాతాపితలందునట్టి దిరుగఁ దో
డట్ట బూనికల్ వేడ్కటే.

చ॥ బ్రతుకు టెడారులం దినుక
లం బడి పాఱఁగనై చిగొన్న నా
హిత వగు లేఖినిన్ దిరిగి
యిచ్చెను గొమ్మిదిగో! యటంచు భా
రతి; యిది యేమి! లోచన త
రంగిత కజ్జల బాష్పముల్ మషీ
గతులుగ రాల్చి, నీవు పెడ
గాఁ జని మోమటు పెట్టినంతటన్.

శ్రీనాథుని కృతులలో ఋతువులు

చిలుకూరి పాపయ్యశాస్త్రి

కావ్యములలోఁ గవులు ప్రసంగవశమునఁ దత్తదృతువర్ణనములు నెఱపుచుందురు. తత్తత్కాలపరిణతినిఁబట్టి భిన్నభిన్నముగఁ గొడచూపు ప్రకృతివైభవ మందు వివరింపఁబడుచుండును. ఋతువర్ణనము ప్రభృతిగఁ దొలుత సంస్కృతకవులు తమ కావ్యములులలో ప్రకృతివర్ణనము చేసియున్నారు. కాని దృశ్యసాక్షాత్కారమునకై వారలుపమోత్ప్రేక్షాద్యలంకార మహితముగ నొనర్చి తత్తద్వికాసము నెంతయుఁ జమత్కారముగ నిరూపించియున్నారు. తెలుఁగుకవులును దమప్రబంధములలోఁ జాలవఱకు నాపరిపాటినే పాటించియున్నారు.

ఒక్కొక ఋతువులోఁ గొన్ని వృక్షములు లతలు పుష్పించును. వేర్వేఱుజాతుల విహంగమరుతములు వినవచ్చును. నదీనదములలో వింతవింత హొయలు గానవచ్చును. వివిధ భోగసామగ్రులు మనోమోదము నొదవించును. ఒక్కొకప్పుడు ప్రకృతి శాంతము ఆస్వాద్యము నగును. వేఱొకపుడు భయానకముగ నుండును. ఒకప్పుడు దృష్టిప్రియము వేఱొకప్పుడు శ్రుతిమధురము నగుచుండును. ఒక్కొకసమయము మానసమున కుల్లాసము వేఱొకసమయమున వికారము నొదవించును. కాలికమయిన ఋతువికాసము సుఖాపాదకము. అకాలికమైన ఋతుపరిణామము దుఃఖాధాయకము.

శ్రీనాథుఁడు తనప్రబంధములలోఁ గాలికములు నాకాలికములు నగు ఋతువికాసములను వర్ణించియున్నాఁడు. తత్తదృతువులలో నాంధ్రావనిలోఁ బొడచూపు ప్రకృతివైభవము నెంతయు హృద్యముగఁ జిత్రించియున్నాఁడు. ఆయాసమయములలోఁ దెలుగునాఁటఁ బాటించు నుత్సవవిశేషములు, అప్పటి మానవుల వినోదములు తన

కావ్యములలోఁ బ్రతిబింబింపఁ జేసినాఁడు. తన్మూలమున శ్రీనాథునినాఁటి పరిపాటు లెట్టియో మనకుఁ దెలియవచ్చును.

శ్రీనాథుఁడు తనకావ్యములలో భావానుసరణమునందును శబ్దసంయోజనమునందును సంస్కృతకవుల మార్గమును విశేషముగ ననుసరించినను, అక్కఱ వచ్చినపుడాంధ్రత్వమును వ్యక్తీకరించుట మానలేదు. ప్రకృతిని వర్ణించుపట్టులలో తెలుఁగుజాతీయతయే యాతని కవితలో మనకు గోచరించును. ఏయే ఋతువులలో నేయే తరులతాగుల్మాదులు వికసించునో, ఏయే సస్యముల కెట్టిపరిణతి యేర్పడునో, ఆనాఁటి మానవు లేయేభోగసామగ్రుల నెటు లాస్వాద్యము లొనర్చిరో మున్నగు విషయములన్నియు నాతని కవితాదర్పణమునఁ బ్రతిబింబించినవి. వానిలోఁ దెలుఁగుతనము ప్రతిఫలించు ఋతువర్ణన మెట్లు నిర్వహింపఁబడెనో, అట్టి పట్టులలోఁ గానవచ్చు విశేషము లీనాఁ డీనాఁట నేవి నిలిచియున్నవో కొంత పరికింతము.

హరవిలాసము - వర్షర్తువు

శ్రీనాథుఁడు హరవిలాసమున వర్షర్తువును వర్ణించుటలోఁ దన ప్రతిభను వెల్లడించినాఁడు. ఇది యాకాలిక వర్షారంభము. చిఱుతొండని భక్తిని బరీక్షించుటకై శివుని యనుమతి నింద్రప్రేరితములై పుష్కలావర్తకాది మేఘము లిరువదియొక్క రోజులు కుంభద్రోణముగ వర్షింపఁ గాంచి కేతెంచినవి. అప్పటి వాని యాటోపమును వర్ణించుటతో నారంభమై విశ్వంభరామండలం బేకార్ణవం బగునంతటి వర్షోద్ధతి చిత్రింపఁబడినది. తత్క్రమ మిట్టులున్నది.

గీ॥ పశ్చిమంబున నింద్రచాపంబు పొడిచె
నిండునెలఁ జుట్టెఁ బరివేషమండలంబు
గగనమార్గంబునందు నాగడప లెగసె
నంబుధరమాలికలు దక్షిణంబు నడచె.

క॥ ఉఱుము మిఱిమి మూలగాడ్పులు
పఱచి విసరఁజొచ్చె మదనసంహారు దెసఁ గ్రొ
మ్మెఱుఁ గుద్భవించెఁ గప్పలు
గఱవఱ గఱవఱగ యనుచు గట్టున నఱచెన్.

ఉ॥ తూనిఁగ లాడఁజొచ్చె; దివి ధూళి భ్రమింపఁగఁజొచ్చెఁ; బిచ్చుకల్
వానకి యుబ్బె; గబ్బిలుఁగు వగాటికి నూటికిఁ గ్రోల్చెఁ గొమ్మపై
వాన యవశ్య మింక బహువాసరముల్ జడివట్టు నం చోగిన్
వానికి వాని కాడిరి నవారణఁ బౌరులు గంచిలోపలన్.

హర. ౨. ౧౫, ౧౬, ౧౭.

ఇంద్రచాపము ప్రాక్పశ్చిమదిశలలోఁ బొడసూపుచుండును. దిశాభేదమునుబట్టి ఫలభేద మొదవుచుండును. ఈ యింద్రధనుస్సును భీమమండలిలోనివారు మొండికొఱవి, లేక మొండికొడవలి యని వాకొందురు. ఈయింద్రచాపము పశ్చిమమునఁ బొడచూపిన నది విశేషవర్షారంభసూచకము. తూర్పునఁ బొడచూపిన వర్షాభావసూచకము. దీనినిగూర్చి హాలికులలోఁ బ్రసిద్ధమయిన యొక నానుడి గలదు. 'తూర్పున మొండికొఱవి వేస్తే పశువులను తుంగబీడులో కట్టవచ్చు. పడమట మొండికొఱవి వేస్తే పశువులను బండతాళ్ళమీఁద కట్టవలె' నని. తూర్పున నింద్రచాపము పొడిచిన జలప్రాయమయిన తుంగబీటిలోఁ బశువులను గట్టినను వానికి వర్షమువలనిబాధ యుండ దనియు, పశ్చిమమున నింద్రచాపము పొడిచిన పశువుల నెత్తయినచోట బండతాళ్ళమీఁదఁ గట్టవలె ననియు కృషీవలుల నిశ్చయము. నిశ్చయముమాత్రమే కాదు. అనుభవముకూడ నట్టిదియే. కాంచిలో నిరువది యొక్కరోజులు కుంభద్రోణముగఁ గురియఁదలఁచిన వర్షవిశేషమున కిది యొక విశేషసూచకము.

ఇటులనే చంద్రునకుఁ బరివేషము చుట్టుట (చంద్రబింబము చుట్టును గుడికట్టుట)యును వర్షారంభసూచకమే. చంద్రునకిట్టి పరివేష మేర్పడినపుడు తెలుఁగునాఁటివారు "దూరపు గుడి కట్టినపుడు దగ్గఱ వానలు, దగ్గఱగా గుడికట్టినపుడు దూరపు వానలు" అని వాకొందురు.

ఆకసమున ఆగడపలు లేచుటయు విశేషవర్షారంభసూచకమే. "ఆకాశము ఆగడపలు వేసినది. వర్షము తప్పక వచ్చు"నని భీమమండలి వారు ఈనాఁటికి ననుకొను పరిపాటి గలదు. ఆగడపలు లేచుట యనఁగా ఆకసమునందు మేఘఖండములు దొంతులుదొంతులుగ నేర్పడుట. ఆకసమునం దాగడపలు లేచినపుడు వర్షము విశేషముగఁ గురియుటయుఁ బ్రసిద్ధమే.

ఆనాఁడు కంచిలో ఊఱు ముఱిమి మూలగాడ్పులు వీచెనఁట. మఱియు నీశాన్యదిశయందు క్రొమ్మెఱుఁగు గుద్భవించెనఁట. కప్పలు జలాశయతీరమునం దుండి 'గఱవఱ గఱగఱ' యనుచు నఱచిన వఁట. ఇవి యన్నియు గాలివాన వచ్చు ననుటకు సూచకములు.

శ్లో. "విద్యు దుత్తర పూర్వాయా మమోఘా మారుతోఽథవా" ఉత్తరదిక్కునకుఁ దూర్పుదిక్కునకు నడుమ నుండి—అనఁగా ఈశాన్యమునుండి మెఱుపుగాని వాయువుగాని బయలుదేఱిన వర్షము తప్పక వచ్చుననుట. గ్రీష్మవర్షర్తువులలోఁ బశ్చిమము నుండియు, శరదృతువునఁ దూర్పునుండియు, హేమంత శిశిరములలో నుత్తరము నుండియు, వసంతమున దక్షిణమునుండియు వాయువులు వీచు చుండును. అట్లు గాక ఈశాన్యమునుండి గాలి వీచుట జలోత్పాతసూచకము. కడచిన వత్సరములలో 1945 అక్టోబరు (ఆశ్వయుజ మాసము) న ఈశాన్యమునుండి గాలి విసరి, భీమమండలి నంటి యున్న సముద్రము పొంగి, ఉప్పెన వచ్చినది. అట్లు మూలగాలి విసరుట యారంభమైనంతనే ఇక్కడికి (కాకినాడకు) ఆఱుక్రోసుల దూరములో నుండిన తాళ్ళరేవు అను గ్రామమున నివసించు నొకజాలరి

ముఖసలి "మూలగాలి విసురుతోంది. ఎక్కడనో ముంచివేస్తుంది" అని హెచ్చరించినాఁడు. సముద్రమున నావలపైఁ బయనించువారల కిట్టిసూచనలు చేయుచుండుట పరిపాటియే. అజాలరి యట్లు హెచ్చరించిననాఁటిరాత్రియే గాలితో వర్షారంభముకూడ నేర్పడి, క్రమము రెండును హెచ్చి, సముద్రము పొంగి తుల్యభాగానదీముఖమున నే మీఁదికి నడచి వచ్చి, సముద్రతీరమునందలి భీమమండలీప్రాంతము జలమయ మయినది. కావున మూలగాలి విసురుట జలోత్పాతసూచక మనుట తెలుఁగునాఁట ప్రసిద్ధమయిన విషయమే. ఇటులనే ఈశాన్య మున మెఱపు మెఱసినఁ గూడ విశేషముగ వర్షము కురియుటయు ప్రసిద్ధమైనవిషయమే. కప్పలు గట్టుమీఁదను నుండి 'గఱవఱగ' యనుచుఁ గూయుటకూడ వర్షాసూచక మగుటయేగాక, ఊర్ధ్వాస్యమకరణమున శ్రీనాథునిరచనలో గప్పకూఁతలు ప్రతిధ్వనించినవికూడ.

తూనీఁగ లాకసమున నాడఁదొడఁగుట, సుడిగాలిచే ధూళి యాకసమునఁ దిరుగఁజొచ్చుటయు సామాన్యముగ వర్షాసూచకములు. పిచ్చుక లుబ్బుట, గబ్బిలుఁగు (చాకలిపిట్ట) మాటిమాటికి కొమ్మ మీఁదినుండి కూయుటయు విశేషవర్షారంభసూచకములు. గాలిమబ్బు పట్టునపుడు సాధారణముగా సుడిగాలి రేగుచుండును. కావున సుడి గాలి రేగుట గాలితోఁగూడిన వర్షమువచ్చుటకుఁ బూర్వరంగము. గబ్బి లుఁగు-అనఁగా గంపవులుఁగు-అని కొందఱు నైఘంటికు లనినారు. కాని దీనిని భీమమండలివారు 'చాకలిపిట్ట' యని యందురు. ఇది వర్షము రాక పోకలను దెలుపు శకునపక్షి. ఇది చాతకజాతికి సంబంధించినది. ఇది యేవైపునుండికూసిన యావైపునఁ బంటలు పండునని యిచటి కర్షకుల నమ్మిక. ఈ పిట్ట తెల్లవాఱుజామునఁ గూసిన వర్షము కురియుననియు, పగటివేళఁగూసిన విశేషముగ నెండ కాయుననియు నీ మండలిలోని యభిజ్ఞులయాశయము, అనుభవమును. ఏది యెట్లయినను దీనికూఁతమా

త్రము వర్షారంభ సూచకము. ఇట్టిసూచన లన్నియుఁ జూచి కంచిలోని జను లిఁకఁ జాలదినములు జడివాన కురియు నని యానోట నానోట నాడుకొనఁజొచ్చిరి.

అనాఁడు కంచిలోని జ్యోతిష్కులు కూడ గ్రహగతిని బరికించి, పై విషయమునే స్థిరీకరించిరఁట.

చ॥ గ్రహసిద్ధాంతకళావిదుల్ సలిలనక్షత్రంబు సీహాకరు
క్సహవాసంబున నభ్రవీథిఁ బరివేషస్థాయియై యుండుటన్
బహువర్షంబిటఁ గల్గునంచుఁ దమలో భాషింపఁగాఁ గంచిలో
గృహమేధుల్ భయమంది రింధనతృణక్లేశంబు చింతించుచున్.

గ్రహసిద్ధాంతకళ నెఱిఁగిన జ్యోతిష్కులు, సలిలనక్షత్రము (పూర్వాషాఢ యని యందురు) చంద్రునితోఁగూడి పరివేషమునఁ (గుడిలో) బడియుండుటచే నిఁకఁ జాల వర్షము కురియునని తమలోఁ దాము వాకొనిరి. ఆ పలుకులు వినిన కాంచీవాసులగు గృహస్థులు కట్టెలకు నీసవునకు శ్రమపడవలసివచ్చు నని భయపడఁ దొడఁగిరి. జడివాన పట్టుసూచన లేర్పడిన నేకాలముననైన ముందుగ శ్రమజీవులు క్లేశము నొందుదురు. ఆవెనుకఁ బాడిపంటలు గల గృహస్థులు వెతఁజెందుదురు. వర్షములు లేకుండినఁగాని, మిక్కుటిగ వర్షము గురిసినఁగాని కృషీవలులకే ముఖ్యముగ లాభనష్టము లధికము. కావున నట్టివారలకు వర్షములను గూర్చినచర్చ యావశ్యకము. ఆలుబిడ్డలతోఁ గూడిన గృహస్థులకుఁ బాడిపంట లత్యావశ్యకములు. పాడిపంటలకు పశుసమృద్ధి నాంతరీయకము. వర్షము లధికముగఁ గురియు వేళలో నెండుకట్టెలు లభింపకున్న వంటలు కొనసాగవు. అందుచే ముసురుపట్టు ననిన సంపన్న గృహస్థులకు మొదటిది యింధనసంపాదన క్లేశము. వర్షము లధికమయినఁ బశువుల కిటునటు దిరుగుట కవకాశములేనపుడు పాడిపంటలు గల గృహస్థునకు గ్రాసచింత. ఇది యానాఁడేకాదు. ఈనాఁడును

పాడిపంటలు గల కృషీవలగృహస్థు లీఁజడివానలకు జడియవలసిదే యుండును.

చిఱుతొండనిభక్తి పరీక్షించుటకై కంచిలో నానాఁడు గురిసినది కుంభవృష్టి. చెలరేగినది గాలివాన. అందుఁ బాల్గొన్నవి పుష్కరావర్తకాది మేఘములు. అవి సంకెలలు వీడి వచ్చి, సముద్రములోని నీరు పానముచేసి కారుకొనినవి. ఆమేఘములు తటిదాఘాతము లను కొరడాదెబ్బలు తిని నొచ్చి చెలరేగినతీరున గర్జింప మొదలుపెట్టినవి. ఇంద్రధనురాడంబర మాకసమునఁ దోరణకట్టి నట్లయినది. బకము లుద్రేకించి పార్శ్వముల నడుచుట రక్షకభటులు బారులు దీర్చినట్లుండెను. మేఘములు కారుకొనినపుడు మెఱయుట ఉఱుముట కొంగలు బారులుతీరుట యనునవి సహజములే యయినను వాని కొక రూపకల్పనము చేయుట వినోదజనకమై వానివాని యతిశయము నెత్రఁగించినది. ఇట్టి యలంకారభూషితముగ విషయనివేదనము చేయుటలో శ్రీనాథుని ప్రతిభ విలక్షణమై కానవచ్చును.

ఆకసమునుండి తొరఁగుచినుకలనుండి యొకవిధమయిన తావి పుట్టినది. ఆపరిమళము భూమిమీఁదఁ బడినచినుకులవలనఁ బొడమిన కమ్మనిసుగంధముతోఁ గూడి, యాఘ్రాణించు వారి ఘ్రాణేంద్రియములకే కాక చిత్తంబుల కాహ్లాదంబు నాపాదించినది. వర్షారంభమునందు గ్రీష్మతప్తమైన నేలమీఁదఁ జినుకులు పడినఁ గమ్మనితావి పొడము ననుట యందఱ కనుభవవేద్యమే. కాని యానాఁటిపరిమళము నాసాద్వారమునఁ జిత్తమున హత్తుకొనునంతటిది రేగిన దనుట విశేషము.

పర్వతశిఖరములందు శిలాతలముమీఁద వడగందు లొకటిపై నొకటి పడఁగాఁ గ్రేంకారము లుత్పత్తిల్లినవి. అట్లు వడగండ్లు పడుట విద్యున్నటి,నాట్యారంభమునఁ బూలదోసిలి వెదఁజల్లుతీరును బోలినది. ఈపోల్చుట యెంతయుహృద్యోదాత్తమై.శ్రీనాథునినాఁడు నాట్యకత్తెలు

నాట్యారంభమున పుష్పాంజలిని జిమ్ము పరిపాటి యుండె ననుటను దోఁపింపఁజేయుచున్నది. కంచిలో నానాఁడు కాముకొనిన మబ్బు ఖండ పరశుకంఠమునఁ జేరిన కాలకూటవిషమషీరసమును బోలియుండినది. అట్టి కాఱుమబ్బులవలన వెలువడిన వర్ష ధారలమూలమున నేళ్లు పూళ్లు నేకమై భూవలయమంతియు నేకార్ణవ మైనదఁట. వర్షము కుండలపోఁత గను కుంచముపోఁతగను గురిసెనఁట. వర్ష మత్యధికముగఁ గురియు నపుడు తెలుఁగువారు నేఁటికి నిట్లు వాకొనుట గలదు.

వర్ష ముతీవ్రత యింతటితోఁ బోలేదు. పిడుగులుకూడఁ బడఁ జొచ్చినవి.

చ॥ తటిదభిఘాతవేగమున ధారలు జోరని కుర్యుచుండఁగాఁ
బిటిలు పిటిల్లనం బ్రిదిలి వ్రేలిపడం దొడఁగెం జతుర్దిశా
తటముల మండుచుం బిడుగుతండము కాంచిపురీజనంబు హ్రా
త్పుటములు జల్లన న్మఘవపుత్రుని పేళ్ళు పదిఁ జపింపఁగన్॥

ఈపద్యము నడకలో జోరుగ వర్షము కురియునప్పుడు, పిడుగులు పడునప్పుడు వెడలు ధ్వని ప్రతిధ్వనించుచున్నది. దీనిలో నకాల వర్షారంభ లక్షణములు సూచితములై నవి. సాధారణముగా పిడుగులు పడు నపుడు జోరుగ వర్షము కురియుచుండవలయును. వానిపాటునకు ముందు పెద్దగ మేఘగర్జనము, అట్టి యుఱుమునకు ముందు తీవ్రమైన మెఱుపులుండుటయు సహజము. మెఱుపులేనిదే పెద్దగ నుఱుముటగాని, ఉరుము లేనిదే పిడుగు పడుటగాని యుండవు. అట్లు పెద్దగ చప్పుడగు నపుడు, పిడుగుపాటునకు భీతిల్లువారు సంప్రదాయము నెఱిఁగియుండినచో నింద్రసుతుఁడైన యర్జునుని పదిపేళ్లను జపింతురు. పిడుగు పడునపుడు తెలుగునాఁటివారు జపించు నామము లివి:—

శ్లో॥ అర్జునః ఫల్గునః పార్థః కిరీటీ శ్వేతవాహనః
బీభత్సో విజయః కృష్ణః సవ్యసాచీ ధనఞ్జయః॥

అగ్ని ఖాండవవనమును దహించునపుడు తక్షకపరివారము రక్షించుటకై దేవేంద్రుఁడు పుష్కరావర్తకాది మేఘములను వర్షిం బంపెను. వాని యుద్రేకము నణఁగించుటకు విజయుఁ డస్త్రపంజర గట్టెను. తక్షకుని రక్షించుటకై యెత్తివచ్చిన దేవేంద్రుని వీ మణంచి, యర్జునుఁడు మేఘాటోపమును హతమార్చినాఁడు. కావు పిడుగుపాటువలని భయము విజయనామస్మరణముచేఁ బోవు నను మైతిహ్యముకూడ నీపద్యమున ననుసంధానితమై యున్నది.

గీ॥ ఊలవడఁ జొచ్చెఁ గామాక్షి నొత్తరించి
నగరితోఁగూడ నేకామ్రనాథు ముంచె
హస్తిగిరినాథుపాదంబు నప్పళించెఁ
గంచిఁ దెప్పలఁ దేల్చె నకాలవృష్టి॥

కంచిలో నీయకాలవర్ష మత్యధికమై, జలపూరవేగమున నూలవడ మొదలుపెట్టినది. వెల్లువ తీవ్రమయినపుడు అడ్డుగట్టినక రంధ్ర మేర్పడి, ధ్వనితోఁ గూడి నీరుబుకుటను ఊలవడుట యందురు గోదావర్యాదినదులు పొంగినపు డిట్లు లూలలుపడుట, వాని నుపేక్షిం చినఁ గట్టలు తెగుట, నిరోధించిన మానుటయుఁ బ్రసిద్ధమైనవిషయమే కామాక్షి యాలయమున నూలవడి యుబికిన నీ రాదేవి నాక్రమించినది దేవళముతోఁ గూడ నేకామ్రనాథుని ముంచివైచినది. మెట్టమీఁద వసించు హస్తిగిరిస్వామియైన వరదరాజస్వామి పాదములనుకూడ దాఁకినది. ఇంతటి తీవ్రవర్షము, కాంచీపురము నంతయుఁ దెప్పల దేల్చినది. అనఁగా జలములో మునిఁగి తేలునట్లు చేసినది. వర్ష మత్య ధికమై తెప్పల సహాయమునఁ బనులు దీర్పవలసివచ్చినచో నీనాను వాఁడుకకు వచ్చుచుండుట యిప్పటికిని గలదు.

కాంచీపురిలో వెలుఁగులేకుండ నిరువదియొక్కదినము లేకా ముగఁ గురిసిన వర్షమును శ్రీనాథుఁడు తెలుఁగునానుడులతోఁ జక్కఁగ

త్రించినాఁడు. "పాము వ్రేలఁగట్టినభంగి, సింగి యవిసి కాఱినచందం
మున, సముద్రము వెల్లి విరిసినలీలగా, బిలంబు తెఱచినవడువున" వర్షము
కురియఁగా ఇంద్రగోపములఠాటోపము వానపాముల విహారము,
ప్పల యఱుపుభేరీధ్వనులు, తాఁబేళ్ల యుద్రేకము, మీనముల
యుల్లాసము చెలరేఁగి మెట్టపల్లములు సమానములై కానవచ్చినవి.

ఇంద్రగోపములను ఆరుద్రపురుగు లని యందురు. ఇవి వర్షా
సమయమునందు గుంపులు గుంపులుగాఁ దలచూపి యంతలో
అంతరించుచుండును. వర్షాసమయమును వర్ణించుపట్టులందు సామాన్య
ముగా నింద్రచాపమును ఇంద్రగోపమును రంగమునకుఁ దీసికొనిరాని
వి యుండఁడు. శ్రీనాథునకు వెనుకటివాఁడును శైవకవివతంసుఁడు నైన
నన్నెచోడుఁడు షడృతువులను వర్ణించుచు, వానిలో వర్షావర్ణనమును
కొంత యధికముగను మధురముగను గొనసాగించినాఁడు. ఒక్క పద్య
ములో నీయింద్రగోపేంద్రచాపముల సొరుసు చిత్రించిన తీరు కనుఁ
గొందము.

ఆ॥ సురపగోపచాపశోభితంబై యుండె
నవపయోదవేళ దివియు భువియు
దెసలు దీటుకొనఁగఁ దృణఘననివహంబు
ఛన్నమయ్యె మఱియు మన్నుమిన్ను.

—కు. సం. ౩. ౧౦౨

వర్షారంభసమయమున భూమి ఇంద్రగోపములతోను, ఆకాశము
ఇంద్రచాపములతోను శోభిల్లుచుండెను. ఆసమయమున భూమియందు
తృణసమూహము ఆకాశమున మేఘసమూహము ఆవరించియుండెను.
ట్లు తృణఘనసజృంభణమును జంటగఁ దెలిపియు వేఱువేఱుగ మధుర
దృశ్యములను సైతము చిత్రించి పెట్టినాఁడు. కనుఁగొనుఁడు :—

క॥ చలిగాడ్పుల ముసురులమెయి
వలిగొని ధాత్రీపురంధ్రి వడఁ బచ్చనికం
బలిఁ గవిచికొన్నవిధమున
బొలుపుగఁ జిప్పరుపు గవిసె భూతల మెల్లన్.

చల్లనిగాలితోఁ గూడిన ముసురులమూలమున భూమియను చలివేయుటచే చిప్పగడ్డి యను నాకుపచ్చని కంబలి గప్పుకొనిన ట్లుం నఁట. వర్షారంభమైనంతనే చిప్పగడ్డి నేలయంతయు నలముకొనును భూమిపై పచ్చని కంబలి పఱచినట్లు తెలుపి లేకయుండును; గా కవిరాజశిఖామణి యిట్టికల్పన గావించినాఁడు. ఇటులనే మేఘాడంబ మునుగూడ రమ్యముగఁ జిత్రించినాఁడు.

గీ॥ ధర నిదాఘవాతాహతి నొఱయకుండ
విధి దమాలమంటపము గావించె ననఁగ
నొప్పె నీలాభ్రపటల మచ్చప్పరమున
రాట లన నెల్లెడెన వానకాళ్లు లమరె॥

ఆకసమం దంతటను నల్లనయిన మేఘపటలము కాలుకొనినది అది గ్రీష్మవాయువు తాఁకుటచే భూమి నీటలు వాఱకుండ దైవము తమాలమంటపము గావించినట్లుండెను. ఆ మేఘములనుండి దిగి వానకాళ్లు ఆపందిలి నిలుచుటకు వేసిన రాటలవలె నొప్పినవి. మేఘ ములనుండి క్రిందికిఁ బొడవైన స్తంభములవలె నల్లని మబ్బుతునకల వ్రేలాడుచుండును. వానిని వానకాళ్లు లని యందురు. అవి యేర్ప నపుడు వర్షము కురియును.

వర్ష మత్యధికమైనప్పుడు మిక్కుటమైన జలములో జలజంతువు విహారములు గానవచ్చుచునే యుండును. కాని యెంతటివర్షము కురి నను మొసళ్లు క్రీడించుట నదీనదములలోఁ గాక నగరములలో నం వించుట యతిశయోక్తి కావలయును. కాంచిలో బయలుదేఱిన

వర్షపువెల్లువయే గాని, యన్యముగాదు. అందును నక్రప్రక్రీడనంబును సూచించినాఁడు. వర్షపాత సూచకముగా పుట్టగొడుగులు లేచుట, లాంగలీపుష్పధూళి దిక్కుల నలముట, ఇంద్రగోపములు చెలరేఁగుట, మున్నగువిషయము లన్నియు నెంతయు స్వాభావికముగ చిత్రింపఁబడినవి. శ్రీనాథుఁడు గావుననే యీవర్షపాతము నింత సర్వాంగసౌష్ఠవభరితముఁ జేసినాఁడు.

భీమేశ్వరపురాణము — వసంతఋతువు

వసంతోదయ మైనంతనే ప్రకృతిలో నూతనవికాస మేర్పడును. ఏయెడఁ జూచినను తరులతాగుల్మాదులు పల్లవప్రసవభరితములై, విహంగమకలకలారావముఖరితములై ప్రాణిమాత్రమునకు హృదయోల్లాసము నొదవించును. అట్టి యామనిసొబగు పరికించినంతనే సహృదయహృదయములు నూతనభావభరితము లగును. రసికకవివరులయెడంద లలో ఋతువికాసముతోపాటు కల్పనలు నన లెత్తును. శ్రీనాథుఁడు రసికకవిపుంగవులలో నగ్రేసరుఁడు. అతఁ డీవసంతవిహారము నెట్లు కొనసాగించెనో పరికింతము.

భీమనాథుఁడు దక్షారామమునఁ బ్రతిష్ఠితుఁడైనప్పుడు, దేవత లందఱు నాతనిఁ గొలువవచ్చిరి. ఆక్రమమున దక్షిణకాశీనాథునిఁ గొలుచుటకై ఋతుచక్రవర్తి యగు వసంతుఁడు కుసుమవిసరము కానుకఁ గొంచు వచ్చెను. ఆతనిరాకతో సచటి సురపొన్నలు సంపెంగలు పూచినవి. అది యెంతయుఁ జిత్రముగఁ గానవచ్చినది.

సీ॥ కబళించె సురపొన్న వనలక్ష్మికబరీబిరాద
సంతరించిన ముత్యాలజల్లి వోలెఁ
బూచె సంపెఁగ లారామభూమియందుఁ
గుసుమనారాచు చిచ్చులకోల వోలె॥

భీమ. ౩. ౮౩

సురపొన్నలు పూచునపుడు వాని పూలగుత్తులు గుబురులు గుబురులుగా నుండును. అవి వనలక్ష్మి కొప్పుపైఁ బెట్టుకొనిన ముత్యాలజల్లి వలె నుండెనఁట. కొప్పు వెట్టుకొని దానిమీఁద ముత్యాలు పొదిగించిన వల వైచుకొనుట శ్రీనాథు నినాఁటి స్త్రీల శిరోజాలంకార పరిపాటి నీయలంకారము మనకు నెఱుక చేయుచున్నది. ఇఁక, నారామభూములలోఁ బచ్చగఁ బూచినసంపెఁగలు పుష్పబాణుఁ డగు మన్మథుని బాణపరిహారమున కుపయోగించెడి ఆగ్నేయాస్త్రములఁ బోలియుండెను. పూవులు మన్మథునకు బాణములై వెలయు నాఁడు, విరియఁ బూచిన సంపెఁగపూలు ఆగ్నేయాస్త్రములఁ బోలి యుండుట సాజమే. తీఁగసంపెఁగలలో నీపోలిక యంతగ లేకున్నను, చెట్టుసంపెఁగపూలు అగ్నిజ్వాలల నెగఁజిమ్ముచున్నటులే యుండును.

అసమయమున దక్షారామమునందలి పెద్దతోఁటనడుమ నాగకేసర వృక్షము పూచినది. దానిపూవు పథికులపాలిట నుత్పాతమును గలిగించు ధూమకేతువువలెఁ గానవచ్చినది. ఆపూవునుండి తుమ్మెదలు చెరరేగుట ధూమము రేగినట్లుండెనఁట.

గీ॥ పాంథనివహంబుపాలి యుత్పాతకారి
ధూమకేతువుఁ బోలి పెన్దోఁటనడుమ
విరిసెఁ గ్రొవ్వారు నాగకేసరవుఁబువ్వు
మీఁది ధూమంబుభంగిఁ దుమ్మెదలు వెడలె॥

హ. ౯౬

వసంతసమయమున మేలితావి గలపూవులు పూచినపుడు ప్రియావియుక్తులగు పథికుల కాపువ్వువికాస ముత్పాతకారియే యగును. ఇచటఁ దోఁటలోఁ బూచిన నాగకేసవుఁబూవు, అట్టి యుత్పాతమును సూచించు ధూమకేతువును (తోఁకచుక్కను) బోలి యున్న దనుట వర్ణనలోని చమత్కృతి. కాదేని యానాఁటి పురుషుల

హృదయములందలి ప్రణయావేశము ప్రియావిరహ దుస్సహము. అట్టి దుస్సహవిప్రలంభమున కీపుష్పవికాస ముద్బోధకాని. నాగకేసర వృక్షమునకుఁ బొడవయిన కాడలవంటి చిన్నయుపశాఖలు బయలుదేరి కొనిని పూలగుత్తు లేర్పడియుండును. అట్టిపూవు లాకృతిలోఁ దోఁక చుక్కను బోలియుండుటచేఁ గవి యట్టులు పోల్చినాఁడు. ఆపూవులపై మూఁగిన తుమ్మెదలు మీఁది కెగయుట ధూమము లేచుట కీడయి యుండును. నాగకేసరపుఁ బూవునకుఁ గేసరము లధికముగ నుండును. దానియాకృతి పడగపై కెత్తి చుట్టలు గొనియున్న సర్పమును బోలి యుండును. కావున నాపూవులకు నాగకేసరము లనునామ మేర్పడి యుండును.

వసంతసమయమున నాసవమాను వారికి వివిధాసవములు సమృద్ధముగ లభించును. దక్షారామమునందలి యచ్చరలు పుష్పాసవము లానుచు భీమనాథుని హిందోళముఁ బాడి కొనియాడి రఁట.

శా॥ సంపద్గాఢ్ణవ చంద్రమండలశిఖజ్వాలాతటిద్వల్లరీ
కందర్పేక్షుశరాసనాచ్యుతతనూగంధర్వవంశోద్భవల్
హిందోళంబునఁ బాడి రచ్చరలు భీమేశుం ద్రిలోకాధిపున్
మందారద్రుమవాటియందు సుమనోమైరేయముల్ ద్రావుచున్॥

కైలాసవాసి పరమేశ్వరుఁడు భీమనాథుఁడై దక్షారామమునఁ బ్రతిష్ఠితుఁడై నపుడు, దేవేంద్రుఁ డాప్రభువునకు భీమమండలిని ధారాదత్తముచేయుచు, నాతనిసేవకై "వారవధూత్రిశతీద్వయంబు" సర్పించి యున్నాఁడు, వారినే శ్రీనాథుఁడు గంధర్వవంశోద్భవలయిన యచ్చరలఁ జేసినాఁడు. బాణుఁడు కాదంబరిలో మహాశ్వేతచేఁ జంద్రాపీడునకుఁ దన జన్మవృత్తాంతమును దెలియఁజేయునపుడు గంధర్వకులములు పదునాలుగుగా లెక్కింపఁజేసినాఁడు వానిలోఁ గొన్నిటి నీపద్యమున శ్రీనాథుఁడు జతఁగూర్చినాఁడు. క్షీరసముద్రమునుండియు, చంద్ర

మండలమునుండియు, అగ్నిజ్వాలలనుండియు, మెఱపుఁదీఁగలనుండియు, మన్మథుని చెఱుకువిల్లునుండియు, విష్ణుని శరీరమునుండియు, జన్మించిన గంధర్వవంశజ లిందుఁ జేర్కొనఁబడినారు. పని వచ్చినపుడు బాణుని రచననుండి విషయములు గైకొనుటలో శ్రీనాథున కాదర మధికము. ఇపుడు వసంతహిందోళము పాడువారు అచ్చరలు; గావున, వారికి సుమనోమైరేయములు త్రావి పాడుకొనుట కనువుపడునటులు, దక్షారామమునకై త మింద్రునిచే స్వర్గమునందు సమకూరు మందారద్రుమ వనవాటి నాఁటించి, శ్రీనాథుఁడు వారిచేఁ బాటలు పాడించినాఁడు. భీమమండలిలో నీనాఁటికిని కేవళములందు వసంతోత్సవములు జరుగుట, తత్తదధిష్ఠానదేవతలమ్రోల వేశ్యాంగనలు పాటలు పాడుటయుఁ బరిపాటిగనే యున్నవి. మైరేయము లానెడియక్కఁటి గూడ నక్కడక్కడఁ గానవచ్చును.

అపుడు విహంగమరుతములు కూడ వింతలు గొల్పినవి.

మ॥ అలికోలాహలసంభ్రమంబును శుకవ్యాజృంభముఁ శారికా
కలసల్లాపములుఁ విహారవిపినక్ష్మోణీవిభాగంబునన్
గలపుంస్కోకిల కంఠకోమలకుహూకారప్రపంచంబుతోఁ
దలఁపించెన్ రతికాంతమూలరథినీధాటీసమారంభముఁ॥

వసంత ముదయించినంతనే యారామములన్నిటిలోఁ బల్లవపుష్ప వికాసములతోపాటు విహంగమకలరవములు కూడఁ జెలరేగును. వానిలోఁ గొన్నిటికలస్వములు మదనపారవశ్యము గలిగించునవి. అట్టి కలకలారావములు దక్షారామ పురోపవనవీథులలోఁ జెలరేగినది. అవి—తుమ్మెదల కోలాహలములు, చిలుకల పలుకులు, గోరవంకల సల్లాపములు. ఇవన్నియు కలపుంస్కోకిలకంఠకోమలకుహూకారముతోఁ జతగూడినంతనే రతికాంతుని మూలసైన్యము దాడివెడలెనా? యని యనిపించెనఁట. అలిశుక, శారికల కలరవము లితరసమయములందును

వినవచ్చును. కాని కలపుంస్కోకిలకంఠకోమల కుహూకారము విన వచ్చుట వసంతోదయమునుండియే. అదియే వలరాజుదాడికి మొదటి గుఱుతు. దానితో మిగిలినరుతములు జతగూడుట మన్మథుని ప్రధాన సైన్యము దండువెడలుటగాఁ జిత్రించుట యెంతయుఁ జమత్కృతిజనక మైనవిషయము.

ప్రకృతిసౌందర్యచిత్రణమున శ్రీనాథుని దృష్టి కడునిశిత మైనది. అతఁడు కడుసూక్ష్మములైన విషయముల నెన్నిటినో మనకన్నుల యెదుటఁ బెట్టును. ఉడుతలు చెట్లకొమ్మలమీఁద చెరలాడుచుండుట సహజమైనవిషయము. కాని దక్షారామ పరిసరారామములలో దానిమ్మ చెట్లు పగిలినపండ్లను గైసేసి యుండఁ, దన్మధ్యమున నుడుతలు గూండ్లు కట్టుకొని క్రీడించుచున్నవఁట. తరులతాగుల్మాదుల మొలతేరిన చిగుళ్లు తామ్రచూడచూడాతామ్రములై (కోడిజూలువలె నెఱ్ఱనై) మదనసామ్రాజ్యసంపదను మాటిమాటికిఁ దెలుపుచున్నవి. కిసలయ రాగమునకు తామ్రచూడచూడారాగము నుపమానముగాఁ గల్పించుట యెంతయు సహజముగను గళాదృష్టి సమన్వితముగను సమకూడినది. వసంతములోఁ దరువు లన్నియు సాధారణముగాఁ బుష్పించును. పూలచెట్లు క్రొత్తపూలలోని మధుపానము చేయుటచే నేర్పడిన హర్షముచేఁ బుష్పించి నూతనలావణ్యముతో నెసలారినవఁట. నూతన కుసుమాసవపానమున హర్షమూలకమగు పుష్పవతీత్వము, తన్మూలమున నూతనలావణ్యలాభము నిందు ధ్వనితము.

అరఁటితోఁటలలోఁ గొత్తగ నరఁటియాకులు లేచినవి. అవి వనదేవత కమర్చిన తాలవృంతములపగిది నెసలారినవి. ఆరామపరిసరములలోని పనసపండ్లనుండి జాలువాఱిన ఫలరసము కాల్వలుగట్టి వన విభాగమును బురదచేయుచున్నది. ఇది యతిశయోక్తి కాదు, మేలి

రకపుఁ బనసచెట్లు పండఁ బాఱినపుడు, పగిలిన యాపండ్లనుండి శీధురసమ
జాలువాఱుట సహజమే. మధుమాసమందమునఁ దుమ్మెదలు చంప
దాడిమీకుసుమ మంజరులలోఁ జెరలాడుదుఁబదములఁ బుష్పరజ
చిమ్మఁగా నచటిపాద లావుప్పొడితోఁ నిండుచుండినవి. అధిక సౌర
భరితములయిన చంపకకుసుమములందును, చిక్కని మెఱుఁగుగల దానిమ్మ
పూలలోను పరాగ మత్యధిక మని యెఱిఁగించుట కీచిత్రణము
ఇఁక మలయసమీరము బయలు దేఱినది. అనూరుతము గోత్ర
మొగ్గతొడిగిన పోఁకబాళలోని నిర్భరామోదముతో నిండి జగదాప్ల
దము నాపాదించుచు విజృంభించెనఁట. శ్రీనాథునికవితలో నేకాల
వాయువు బయలుదేఱినను నది పోఁకపొత్తులలోని పూలతావిసిగొ
రాకుండ నుండదు. ఇప్పుడీవసంతమున మలయపవనము సైతము మ
యుజగంధముతోఁ దనివిచెందక, క్రముకకుహాళీగర్భనిర్భరామోద
దుర మయినది.

అటుపైని సహకారభూరుహములవోలె వసంతోత్సవమ
నారంభింపఁ జేసినాఁడు.

సీ. కర్పూరకస్తూరికలఁ గోట నిర్మించి
కుంకుమద్రవమునఁ గొమ్మఁ దీర్చి
యగరుజంబాలంబు నంచు బెండడిఁ జేసి
పన్నీరువెల్లువఁ బరిఖఁ దాల్చి
పవడంపుఁజివురుల గవను లుత్పాదించి
తమ్మిరేకుల బోరుతలుపు లెత్తి
రత్నాంకురంబుల రంగవల్లి రచించి
పట్టుఁబుట్టంబులఁ బడగ లెత్తి
లలితశృంగారరచన నలంకరించి
విబుధగంధర్వు లామని వేళలందు
భీమనాథుని నగరియారామ రేఖఁ
బూజచేసిరి సహకారభూరుహముల. భీమ ౫-౧

ఆయామని వేళ వసంతోత్సవములోఁ బాల్గొనిన దేవతలు గంధర్వులు, భీమనాథుని యంతఃపురమునందలి యుద్యానములో సహకారతరువులఁ బూజచేసిరి. అచట లలితమైన శృంగారరచనలు గావించిరఁట. కర్పూరముతోను కస్తూరితోను కోటను నిర్మించిరి. కుంకుమపుష్పద్రవముతో శిఖరముఁ దీర్చిరి. ఈనిర్మాణమునకు అగురును బెందడిగా నుపయోగించినారు. పన్నీటిప్రవాహముతోఁ గందకము నేర్పఱిచిరి. పవడపుఁ జిగుళ్లతో ద్వారము లేర్పఱిచి, పద్మదళములతో బోరుతలుపు లెత్తినారు. రత్నఖండములతో రంగవల్లిఁ దీర్చి, పట్టువస్త్రములతో జెండాల నెగురవేసినారు. ఇట్టి శృంగారరచన, ఆమనివేళ బహుళశోభాభరితమైన సహకారమునకుఁ బూజ శ్రీనాథునినాఁటను పరిపాటిగ నుండనోపు. కాని యిట్టిదేత యీనాఁ డంతగఁ గానరాదు.

మఱియు నానాఁ డీవసంతోత్సవములలో వనితలు కూడఁ బాల్గొని,నాయకునిపై జెఱుకువిండ్లను మోపెట్టి పుష్పబాణముల నేయుచుండు నుత్సవమున కొకయంగ మైనట్టులు గన్పట్టును.

చ. అనువగుఁ గౌనుదీఁగ లసియాడఁ బయోధరముల్ వడంకఁగాఁ
గనకమరాళకీరకలకంఠమయూరరథాధిరూఢలై
వనితలు భీమనాయకుని వారక యేసిరి కమ్మఁదేనియల్
చినుకు పసిండిలేఁజెఱుకుసింగిణివిండ్లను బుష్పబాణముల్.

వనితలు కొందఱు బంగారుహంసలు చిలుకలు కోయిలలు నెమిళ్లు రథములుగాఁజేసికొని, వాని నధిరోహించి,లేక ఆపతంగముల యాకృతులు గల రథముల నెక్కి, బంగరులేఁత చె[illegible]లవిండ్లనుండి పూబాణములను భీమనాయకునిమీఁద వేసిరఁట. రథాధిరోహణము చేసినపుడు వానికదలికచే నావనితలయందమయిన కౌనుఁదీఁగ లసియాడినవి. పయోధరములు వణఁకాడినవి. అట్టియవయవసౌష్ఠవము గల వనితలా చెఱుకువిండ్ల నెక్కుపెట్టి పుష్పబాణములు విసిరినా రనుట, మన్మథుఁడు చెఱుకువిలుకాఁడు

పూవుటమ్ములు గలవాఁడుగావున వసంతోత్సవాంగముగా నీక్రియ
కలాపము నడచినది. ఇట్టులే మఱియొక చంచలాక్షి, బంగారురథమున
మీఁదిభాగమున శిఖరముపైఁ గీలించిన కాంచనపత్త్రిపద్మము దు
నడుమ నిలువఁబడి, చిత్త్రగతిని నర్తనము సేయుచు, దేవశిఖామ
యగు భీమనాథుని బుష్పబాణములతో సూటిగ నేసినట్టు లీ క్రిం
పద్యమునఁ జిత్రించినాఁడు. ఇది యప్పటినాట్యభంగిమతీరును దెలుపును

ఉ. చంచలనేత్త్రి హేమరథసౌధశిరోగృహకూటకోటిపైఁ
గాంచనపత్త్రిపద్మమునఁ గర్ణికమధ్యమునందు నిల్చి ని
ర్వంచన నేసె; నంతఁ బరినర్తనచిత్త్రవిలాసలీల న
ర్తించుచుఁ బుష్పబాణముల దేవశిఖామణి భీమనాథునిన్.

అంతట భీమనాథుఁడు వసంతకేళీవిహారములు జరుపుట కాజ్ఞ వాటించి
దేవతాశ్రేష్ఠులకు నుత్సవానుకూలమగు గంధకర్పూరకస్తూరికాదివస్తు
వుల నొసఁగ నియమించెను. అప్పు డప్పురియందలియంగనాజనంబులు
జిలుగుచెంగావిరంగు చీరల దాల్చి, కుంకుమద్రవమును మై నలఁది
కొని, వలిముత్యములు జోడించినభూషల నలంకరించుకొని, అందమైన
కొప్పులలో మొగలిరేకులు చెరివికొని దేవతాచకోరాక్షులు భీమ
నాథుని సేవింప వచ్చిరఁట. దక్షారామమునందలి చకోరేక్షణలు నల
రాజు గెలిచిన పెద్దకాలపువేల్పగు భీమనాథుని గూడ వలపింప నేర్చిన
వారలు. భీమనాథుఁడు రాజశేఖరుఁడై యాజ్ఞ వాటించినంతనే యావ
నిత లొక్కుమ్మడిగ నాతనిఁ గొల్వవచ్చి రనుటలో వారల విహారప్రియ
త్వము వ్యక్తమగుచున్నది.

వ. అప్పు డప్పురంబున నంగనాజనంబులు—

మ. జిలుగుంజెంగావన్నె చేలలును గాశ్మీరాంగరాగంబులున్
వలిముత్యంబులభూషణంబులును భాస్వత్కేతకీపత్త్రికా
విలసద్వేణులుఁ జొక్కమై మెఱయఁగా వేల్పుంజకోరేక్షణల్
లలి భీమేశ్వరు రాజశేఖరునిఁ గొల్వన్వచ్చి రొక్కుమ్మడిన్.

భీమ. ౫-౧౦౮.

రాజశేఖరుఁడయిన భీమనాథుని యాజ్ఞను బాటించి యీయుత్సవమునఁ బాల్గొనుటకు బయలుదేఱినవారు ఆపురమునందలి, అనఁగా దక్షారామమునందలి యంగనాజనంబులు. వారలావెంటనే వేల్పుంజకోరేకుఁగలైనారు. కారణమేమన శ్రీనాథునిదృష్టిలో దక్షారామమునందలి విలాసినులందఱును చంద్రునితోఁ గల్పవృక్షాదులతో మున్నీటినుండి వెలువడిన విబుధగంధర్వజాతులవారే గాని మనుష్యమాత్రులు గారు. అట్లయినను శ్రీనాథుఁడా వేల్పుంజకోరేకుఁగలచేస్సైతము జిలుగు చెంగావి చీరలు ధరింపఁజేసి, కాశ్మీరపద్మము నలఁదించి, ముత్యాలభూషణము లలంకరింపఁజేసి, జడలలో మొగలిఱేకులు దోప్పింపఁజేసినాఁడు. కావున్న స్వర్లోకలభ్యములగు నలంకారము లమరింపఁ జేసినవాఁడే. ఏది యెట్లయినను శ్రీనాథునికాలమునాఁటి విలాసినుల వస్త్రాంగరాగాలంకారములతీరుమాత్రము యీపద్యమందు వ్యక్తమయినది. మఱియు నానాఁడు రాజులు వసంతోత్సవమున కాజ్ఞాపించుట, పురజను లాతని యాజ్ఞ పాటించి, వస్త్రభూషాదులు కైసేసి విలాసినీప్రధానముగ సంముఁ బాల్గొనుట యుట సూచితము.

పిమ్మట నావసంతోత్సవమునఁ బాల్గొనుటకు విఘ్ననాథుఁడు పాతాళభైరవుఁడు వీరభద్రుఁడు బ్రహ్మాదిదేవతలు, ఇంద్రాద్యష్టదిక్పాలకులు వారివారిసతులతోఁగూడ వచ్చిరి. నికుంభకుంభోదరాదీశ్వరపరివారములు, సురగరుడోరగకిన్నరాదిదేవతాగణములు, సముచితంబుగఁ గైసేసి వచ్చిరి. పరమేశ్వరుఁడుకనుసంజ్ఞచేసినంతనే విలాసినులు సుగంధద్రవ్యములగు కస్తూరి కర్పూరము మంచిగంధము మున్నగు వానిని దేవతలపై వినరఁజొచ్చిరి. క్రమముగ నేతులతో నూనెలతో జవపుకుంకుమము చెందిరము కుసుమరజము మున్నగువానిని మేదించి, పిచికలు పుష్పములపైఁ జల్లఁదొడఁగిరి. ఆచల్లులాటలో వారివరుసలు సూత్రము పాటింపఁజొచ్చిరి. పుష్పములలో విఘ్నేశ్వరుఁడు తుండ

ముత్తో గాతివిూజలము పూరించి వదలుచు నితలోలమునం దొకరు సట్టులు విహారము సేయఁదొడఁగెను. ఈవిధముగ వివిధవిహారములచే వసంతర్త్వారంభము త్రిభువనదృక్ప్రియతమం బయ్యె నని శ్రీనాథుఁ డెంతయు వింతగ నీవసంతోత్సవమును దక్షారామమున నెఱపినాఁడు. ఈయుత్సవమునందలి పరిపాటు లెన్నియో యీనాఁటికిని దక్షారామ పరిసరమునందు జరుగు దేవతోత్సవములలోఁ గానవచ్చుచునే యుండును.

భీమేశ్వరపురాణములోఁ గొనసాగిన యీవసంతోత్సవమునఁ బాల్గొనినవారు దేవతలు దేవతాపురంధ్రులే యయినను, అందుపయోగించిన సుగంధద్రవ్యములు మున్నగునవిమాత్రము శ్రీనాథుని కాలమున అనఁగా 15 వ శతాబ్దిని కుమారగిరి రెడ్డి (వసంతరాయబిరుదాంకితుఁడు) నెఱపు వసంతోత్సవములో నుపయుక్తములై నవియే. వానినే హరవిలాసకృతిభర్తయయిన అవచి తిప్పయ్యసెట్టి, నావలపై ద్వీపాంతములనుండి గొని తెచ్చియిచ్చుచుండెడివాఁడు. రాజమహేంద్రవరము రాజధానిగాఁ బాలించు వీరభద్రారెడ్డియు మార్కండేయస్వామికి వసంతోత్సవము నెఱపు నాఁడీసుగంధద్రవ్యము లుపయోగించినట్టు లీక్రిందిపద్యము తార్కాణించుచున్నది.

మ. కలపుంస్కోకిలకంఠకోమల కుహూకార స్ఫురత్పంచమ
స్థలదధ్వన్యములైన కాలముల మార్కండేయనాథేశ్వరున్
లలితక్రీడల వీరభూపతి వసంతంబార్చు నప్పాటి వీ
థుల కర్పూరహిమాంబుసంకుమద కస్తూరీపటీరంబులన్.

కా. శీ. ౧-౫౦.

వాని నీయుత్సవమునం దతిమాత్రముగ నుపయోగించినారఁట. అవి కృష్ణాగురు కుంకుమఘుసృణ కర్పూరము మున్నగునవి. ఉత్సవావసానమున కావస్తువు లెట్టి వింతలు గొలిపినవో శ్రీనాథుని నోటనే విందము.

మ. అగురుం గుంకుమపూరియుం దిమిరసంధ్యారాగసంస్పర్శముం
గగనాభోగము సంధ్యకాలము నవోఁ గావింప, నాభంగికిం
దగియెం జుక్కలు వోలెఁ దాండవగణాధ్యక్షుని తుండంబున
న్నెగయం జల్లిన సప్తసింధుజలవేణీబిందుసందోహముల్.

భీమ. ౫-౧౧౯

కృష్ణాగురువు చీకటివలె, కుంకుమద్రవము సంధ్యారాగమువలె ఆకాశప్రదేశము సంధ్యాకాలమువలెఁ గావింపఁగా, దానికిఁ దాండవ గణపతి తుండంబుతో నెత్తి మీఁది కెగయఁజిమ్మిన సప్తగోదావరీ జల బిందుసందోహము చుక్కలవలె నెనలారినవి. ఇది యొక మధుర కల్పన. ఆయుత్సవమునఁ గుంకుమము అగురు మున్నగునవి యతి మాత్రముగ నుపయోగింపఁబడె ననుట కిది యొకనిదర్శనము.

ఈతీరున శ్రీనాథుఁడు ఋతుచక్రవర్తి యయిన వసంతము నభివర్ణించుచు, ప్రకృతిలోఁ గానవచ్చు వివిధవికాసములను, వాతప్రసారమును, విహంగముల కలరవములను, దేవతోత్సవపరిపాటిని, అందుఁ బాల్గొనెడి విలాసినుల విలాసములను, భీమమండలిలోని జనుల యుల్లాసావిశేషములను వివరించుచుఁ గావ్యమును మధురము నొనర్చినాఁడు.

కాశీఖండము—శరదృతువు.

అగస్త్యుఁడు లోపాముద్రతోఁ గూడి, దేవతాప్రార్థమునఁ గాశినుండి పయనమై వచ్చి, వింధ్యాటోపము నణఁగించి, గోదావరినోరసి కొనుచు నాంధ్రదేశమునఁ దిరుగాడుచుండ శరదృతు వవతరించెనఁట. ఈఋతువునకు సంబద్ధముగఁ జేసిన శ్రీనాథుని ప్రకృతిచిత్రిణ మంతయు భీమమండలికి సంబంధించినదే. కావుననే "కుంభసంభవుండు గోదావరి నోరసికొనుచు నాంధ్రదేశమున నరుగునప్పుడు" అని యుపక్రమించి శరదృతువును బ్రవేశపెట్టినాఁడు. ఇచట మూలమగు సంస్కృత కాశీఖండములో:—

శ్లో. గోదావరీతటం రమ్యం విచరన్నపి వై మునిః
న తత్యాజ చ తం తాపం కాశీవిరహజం ముహుః.

అని గోదావరీతటమున నగస్త్యుఁడాని పంచరించినట్టు లొక్క-శ్లోకము మాత్రమే యుండఁగా, దాని నుపశ్రుతిగఁగొని యామహర్షిని ఇరువది మూఁడు గద్యపద్యములనడకలో భీమమండలియంతయుఁ దిరిగించినాఁడు. ఆపరికరణమునందతికించుచు నిట్లులనినాఁడు.

గీ. కుంభజుఁడుదక్షిణాభిముఖుండగుటయు
నదను వీక్షించి వచ్చెనో యనఁగ వచ్చె
శంబరారిప్రతాపాగ్నిసామిధేని
నవశరద్వేళ శ్రీభీమనాథుఁ గొలువ.

కాశీ. ౩-౨౦

కుంభసంభవమహాని దక్షిణదిగభిముఖుఁడయిన యదను చూచుకొని వచ్చెనో యనునట్లులు, మన్మథప్రతాపాగ్నికి సామిధేనీమంత్రము (జ్వాలావృద్ధికరమయినమంత్రము) వలె, నూతనశరత్కాలము భీమనాథుని గొలుచుటకై వచ్చెను. శరత్కాల మారంభమగునంతనే దక్షిణమున నగస్త్యోదయ మగుచుండును. దీనిని దెలుఁగునాఁటివారు 'చుక్కపొడుపు' అని వ్యవహరింతురు. ఇది దక్షిణదిశయందే పొడచూపును. ఈవిషయ మీపద్యమున వ్యక్తమయినది. మఱియు శరద్వేళను సూర్యచంద్రాతపములతోపాటు మన్మథుని ప్రతాపముగూడ పెరుగును. ఆవిషయము కూడ నిందుసూచితము.

శరత్కాలారంభమునకు మేఘములు కుంభవృష్టి వెలయించి దిక్కులందలి జిగురుతోఁగూడిన రజమును (ధూళిని) గడిగి మలయజమును (మంచిగంధము) వలెఁ దెల్లదనమును గలిగియుండును. అట్టివేళ దిక్కులన్నిటను సూర్యుని వేఁడిమి చూపట్టును. వర్షాసమయమున సూర్య

మండలము మేఘావృత మగుటచే సూర్యుని వేఁడిమిగాని యెండగాని కానరాదు. శరదారంభ మయినంతనే మేఘావరణము పోయి ప్రభా కరుని వేఁడిమి గానవచ్చును. ఈవిషయము నీక్రిందిపద్యమున శ్లేషమూలకానోపముతోఁ జక్కఁగఁ జిత్రించినాఁడు.

గీ. జిగురుకొన్నరజస్స్వార్తిఁ జెరగు మాసి
జలదకుంభోదకంబుల జలక మాడి
మలయజాచ్ఛపయోధరమండలలగు
దిగ్వధువులందు శుచిఁ బ్రవర్తించె నినుఁడు.

దిక్కులనెడి స్త్రీలు, జిగురుగట్టిన ధూళిస్వార్తిచే చెరఁగుమాసి, మేఘములనుండి పడిన కుంభోదకములతో స్నానముచేసి, మంచి గంధమువలె స్వచ్ఛమైన మేఘమండల మనెడి మంచిగంధపు పూతఁ బూసిన పాలిండ్లు గలవై యుండ వానియెడ సూర్యుఁడు శుచితోఁ బ్రవర్తించెనఁట. ఈపద్యమునందు చెరఁగుమాసిన వధువులు జలకుంభ ములతో స్నానముచేసి, స్తనముల మంచిగందపుఁబూఁత కైసేసి కొనినపుడు ధవుఁడు శుచితో సంగమించుట ధ్వనితమగుచున్నది. ఇందు రజోదర్శనమునఁ జెరఁగుమాసిన నాఁటి యువతులు కుంభోదక ములతో స్నానముచేసి, మలయజచర్చచేసికొనినఁ బరిశుద్ధులగుదు రనునాఁటిపరిపాటియు సూచిత మగుచున్నది.

శరదృతువునందు శ్రీమహావిష్ణువు భుజగశయనమునుండి మేల్కాం చును. కావుననే శరదృతువునందలి కార్తికశుద్ధైకాశిని ఉత్థానైకాదశి యని యందురు. ఆనాఁడు లక్ష్మీనారాయణులకుఁ బూజగావింతురు. విష్ణువు శేషతల్పమునుండి మేల్కాంచుట శరదృతువునందుఁ గాన నాదృశ్యము నీప్రసంగమునం దిట్లు చిత్రించినాఁడు.

ప్రకృతి వర్ణనలు - ఆంధ్ర వాఙ్మయము

రచయిత : శ్రీ బొడ్డుపల్లి పురుషోత్తము, యమ్. ఎ.

(విహంగావలోకము)

౧

మానవకల్పితము కానిదంతయుఁ బ్రకృతి. ఇది సత్యము శివము, సుందరము నైనది. నవనవోన్మేషణ మైనది. నిత్యోత్సవసన్య మైనది; 'లలితావలోకన స్నేహజ లీలావ్యతికలిత' మైనది. ఆనందోపలబ్ధి నాసించు ప్రతిమానవునకుఁ బాధేయమైనది. దా ననుభవించు నానందము నక్షరరమ్యముగ లోకమునకుఁ బంచిపెట్టు కవుల కీ ప్రకృతి నిత్యోపాసనాదైవ మైనది. అంతియేకాక ప్రకృతిదేవి తన నిజస్వరూపమును, భావప్రఫుల్లమును, కమనీయము నగు కవీశ్వర వాగ్విలసనములఁ దెలిసికొని లోలోన మురిసి మురిసి పోవును. అందువలననే "ప్రకృతి పరిణేతల్ కవుల్" అను నార్యోక్తి.

అది బహుయుగయుగాంతములనాఁటి మాట. విమల బ్రహ్మాధీనత రమించు ఋషిపుంగవు లుద్గీథముగ ఋక్సామములఁ జెప్పెడు నానంద తనూతారుణ్యరోచనముతోఁ బ్రత్యక్షమైన యుషాదేవి కిట్లంజలించిరి.

"లోకమునకు లోచనమ్మ
లోలచిత్రలోచితమ్మ
నాలోకింపు ముఖమ్మును
తమోభుగ్నకుటీప్రాంగ
ణముల కవాటములఁ దెఱచె;
తిరోధానమైన జగము
తెర దొలఁగించిన దదిగో !!
విశ్వమ్ముల మేలుకొల్పి

వికసించిన దుషాదేవి !!!"
అనారతము రోదసినే
అవలోకించుచు నుదయమ్మయి
సర్వము వ్యాపించె
యతివ యీమె యుషఃకన్య !!
ఉదయమై మంజుల
వరోజ్వలాంబరము ధరించి
ఉన్నతురా లీమె వెడలు
చున్నదదో కనుంగొనుము !!!
బంగరుపూతలతో నా
యంగన యందఱిహృదయము
పొంగించుచు వారిలోన
రంగరించు జీవరసము"

—(విద్వాన్ విశ్వం)

"ఇట్లే వీరీ చిన్మయమైన యరుణతేజమును శైశవనైర్మల్య మధురహాసముగను, మాతృదేవీ ప్రేమార్ద్రవీక్షణముగను, ముగ్ధ స్త్రీ ఆభిజాత్యముగను, నుషస్సూక్తుల నాలపించిరి. ఏమి యీ యార్య ఋషుల ప్రకృత్యుపాసనా తత్పరత ! మహోన్నత భావుకతాశబలత ! ట్టి వర్ణనములు ఋగ్వేదమున నతి వ్యాప్తములు. కవినామము నిజ మున కీ ఋషిపుంగవులయందు సార్థకత భజించుకొనుటచేతనే 'నానృషిః రుతే కావ్యమ్' అను నార్యోక్తి యీ దేశమునం గలిగినది.

౨

వైదిక ధర్మమును జన సామాన్యమున కందుబాటు గావించు టకు వెలసినవి యితిహాసములు. ఇందుం గథాకథనమే ప్రధానము. యినను వాల్మీకి కోకిలాలాపములలోఁ బ్రకృతి వర్ణనలు పదపదమునం

ప్రతిధ్వనించినవి. అందలి నాయికా నాయకులకుఁ బదునాలుఁగే డ్లరణ్య నివాసమగుటచే నాయా ఘట్టములఁ బ్రకృతికిని, కథకుని నవినాభావసంబంధ మేర్పడినది. "తం దృష్ట్వా మృత్యు సంకాశం తీక్ష్ణ దంష్ట్రం మహాభుజమ్, ప్రాద్రవన్ గిరిసంకాశం భయార్తా వ దేవతాః" అని సీతాపహరణసందర్భమునఁ గవి, ప్రకృతిదేవతలు కూడ రావణునిచర్యను జూడలేక పరువెత్తిపోయిన వని యుదాత్తము వర్ణించినాఁడు. తా నపహరింపఁబడుచున్న వార్తను రామున కందఁజేయు డని సీతాదేవి మాల్యవంతపర్వతమునకును, గోదావరీ నదీమతల్లికిని వనదేవతలకును మ్రొక్కుకొన్నది. రావణాపహృత యగు సీతయెడల బ్రకృతి చూపిన సానుభూతి పరికింపుఁడు.

"నలిన్యో ధ్వస్తకమలా స్త్రస్తమీనజలేచరాః
సఖీమివ గతోచ్ఛ్వాస మన్వశోచంత మైథిలీమ్ !!"

క్రూరాక్రూర మృగములుఁగూడ నాసాధ్వీమతల్లిని విడలేక యామె నీడ ననుసరించి పరుగు లెత్తినట్లు చేసిన యీవర్ణన మమూల్యము; అతి లోకసుందరము !!

"సమంతాదభిసంపత్య సింహవ్యాఘ్రమృగద్విజాః,
అన్వధావం స్తదా రోషా త్సీతాం ఛాయానుగామినః!!".

సీతావియోగశోకోపహతుఁ డగు శ్రీరాముఁడు తన యర్ధాంగిని గూర్చిన వార్తను తెల్పుఁ డని చెట్టుచెట్టును బుట్టఁబుట్టను ప్రార్థేయ పడును. ఈ తీరునఁ బ్రకృతివర్ణనలు రామాయణేతిహాసముతోఁ దాదా త్మ్యమును బొంది కవివర్ణనావైశారద్యమును బ్రస్ఫుట మొనర్చినవి. భర తుఁడు శ్రీరాము నయోధ్యకు మరలించుకొని పోఁదలంపుతో రానున్న సమయమున శ్రీరాముఁడు చిత్రకూటపర్వత పరిసరశోభారామణీయ కమును సీతకు వర్ణించుపట్ల వాల్మీకి చూపిన వర్ణనావైదగ్ధ్యము నవనవో న్మేష మైనది. రామాయణమునందువలె మహాభారతమునఁ బ్రకృతి

వర్ణనల కితివృత్తముతోడి విలీనత గాంచము. అందులకు హేతు వా మహేతిహాసకర్తలలోను నితివృత్తములోను గలదు. వాల్మీకి వ్యాసుని కన్న లోఁతైన కవితాహృదయసంపత్తి గలవాఁడు. వ్యాసుఁడు రూపుగొన్న విజ్ఞానసర్వస్వము. తత్కాల చరిత్రమును లిఖించి ధర్మసమన్వయము గావించుటయే యాతని ముఖ్యకర్తవ్యము. అయినను 'సౌగంధికపుష్పాపహరణా'ది సందర్భములఁ బ్రకృతిశోభ ప్రత్యక్షసుందరమే !!

3

కవికులగురు వగు కాళిదా సాదికవి యగు వాల్మీకిని సేవించి ప్రకృతివర్ణనానైపుణ్యమున నతనివలె సిద్ధహస్తుఁ డైనాఁడు. కుమారసంభవకావ్యమున హిమాలయవర్ణన మనితరసాధ్య మైనది. స్థాణ్వాశ్రమప్రాంతమున నకాలవసంతాగమనవర్ణనము చరాచరచేతనములకు రతిక్రీడాభిప్రేరణను గల్పించు సమర్థ మాట మహాకవికేఁ దప్ప, సాధారణకవులకు సంప్రాప్తింపని శిల్పము. శకుంతలరూపకమునఁ బ్రకృతివర్ణనలు కథతోఁ బ్రకృష్ట సంబంధము కలవి. పాశ్చాత్యకవిపండితులను గూడ నానందపరవశముఁ జేసిన దీ మహాగుణమే. శకుంతల ప్రకృతిచే రక్షింపఁబడి, ప్రకృతిలోఁ బెరిగిన ముద్దుబిడ్డ. తన జీవితానందమును బ్రకృతిలో ముడివెట్టుకొన్న ముగ్ధ. తన లతాదులకు నీర మిడక, తన శాబకముల కాహార మందీయక యామె యెన్నఁడును దనపొట్ట నింపుకొనలేదు. ఏమి స్వార్థరాహిత్యము !

శకుంతల యత్తవారింటి కేఁగుసమయమున వనమంతయుఁ గానుకలర్పించి సంతుష్టి నొందుచున్న విధానము చూడుఁడు:—

"క్షౌమం కేనచి దిన్దుపాండుతరుణం మాంగల్య మావిష్కృతం
నిష్ఠ్యూత శ్చరణోపభోగసులభో లాక్షారసః కేనచిత్.
అన్యేభ్యో వనదేవతాకరతలై రాపర్వభాగోత్థితై
ర్దత్తా న్యాభరణాని తత్కిసలయోద్భేదప్రతిద్వన్ద్విభిః"

ఇంగుదీతైలముచే గాయము మాను పట్టించుకొన్న హరిణ శాబకము శకుంతలను వీడిపోఁజాలకున్నది. శకుంతలావియోగభారమున

"ఉద్గళితదర్భకబళా మృగాః
పరిత్యక్తనర్తనా మయూరాః
అపసృతపాండుపత్రాః
ముంచ న్త్యశ్రూణీవ లతాః"

మృగములు తినుచున్న దర్భలను వదలివేయుచున్నవి. మయూరములు నర్తించుట మానినవి. పండుటాకులు రాల్పు లతలు కన్నీటిబిందువులు రాల్చుచున్నట్లున్నవి. కణ్వుని కంఠము స్తంభించినది. తపోవనము చింతాభారముచే నాక్రందన మొనర్చుచున్నది.

ప్రకృతి నిట్లు దృశ్య మొనర్చుట కాళిదాసునకే చెల్లినది. ఒక్క ఉత్తరరామచరిత్రమందు దీనిప్రతిబింబములు కానవగునేమోకాని మఱే యితర సాహిత్యమునందును గరుణరస మిట్లు ప్రకృతినుండి ప్రవహింపలేదనుట యత్యుక్తి కాదు. అసలు కాళిదాసు బాల్యమునుండియుఁ బ్రకృతి పరిశీలన వతత్పరుఁడు. అందువలననే తొలుత ప్రకృతి వర్ణనలే కావ్యవస్తువు గావించి "ఋతుసంహారము"గావించినాఁడు. అనంతరము ప్రకృతికిని మానవప్రకృతికిని నవినాభావమును గూర్చి భూలోక స్వర్గలోకముల రససేతువును నిర్మించినాఁడు. ప్రకృతిని వస్తువునకును నభేదాధ్యవసాయము కల్పించుటయందే కవిప్రతిభ భాసిలును. కావ్య వస్తువుతోఁ దాదాత్మ్యము నందని ప్రకృతివర్ణనలు పేటికాంతర్గతము లగు రత్నహారములను బోలినవి మాత్రమే. ముద్రారాక్షసరూపకమున రాక్షసుఁడు జీర్ణోద్యానముఁబ్రవేశించి చేసిన వర్ణనము కథాతాదాత్మ్య మందిన యుత్తమవర్ణనము. ఇట్టివి సంస్కృత వాఙ్మయమున ననేకములు:—

౪

ఋషితుల్యుఁ డగు నన్నయ ప్రకృతివర్ణనాతత్పరతను రెండవ వాల్మీకి. ప్రణవనాదమువలె గంభీరమును, అక్షరరమ్యము నగు నతని ప్రకృతివర్ణనము లత్యంతమధురములు. ఆతని "శారదరాత్రులు" ఆంధ్రికి వాహ్యాళిసమయములు. ఈతనివర్ణనలు కథాగమనమున కవిరోధములు. కొన్నిప్రసన్నకథాకథనమునఁ బఠితకుద్దీపనమును గల్గించి, భావ్యర్థసూచనముల నిచ్చునవి. ఉదాహరణము:- వేఁటకువచ్చి, కణ్వమహర్షి యాశ్రమప్రాంత మని తెలిసికొని యామహనీయుని దర్శించు కుతూహలముతో వచ్చుచున్న దుష్యంతునికి లతాలలన లిచ్చిన స్వాగతము—

"అతిరుచిరాగతుం డయిన యాతనికిన్ హృదయ ప్రమోదమా
తతముగ నవ్వనంబున లతాలలనల్ మృదులానిలాపవ
ర్జితకుసుమాక్షతావళులు సేసలువెట్టినయట్టిరైరి సం
పతదళినీ నినాదమృదుభాషల దీవన లొప్పనిచ్చుచున్!! "

లతాలలనలు కుసుమాక్షతలు చల్లినవి. తుమ్మెద లాశీర్వచనములు పల్కినవి. తన్మూలమున దుష్యంతున కచిరకాలమున రానున్న శకుంతలా పరిణయ మాంగళ్యము చక్కఁగ సూచింపఁబడుచున్నది.

శతశృంగపర్వతమునఁ బత్నీసమేతుఁడై పాండురా జున్న సమయమున 'నఖిల జీవలోకానంద జననంబును'ను 'సర్వభూత సమ్మోహనం' బయిన వసంతాగమనము మూలమున లేనిదానిని గల్పించి పాండురాజునకు మన్మథోద్దీపనమును గల్గించుటలో నన్నయ ప్రకృతివర్ణనమునఁ దనకున్న యుపజ్ఞను బ్రదర్శించి యాంధ్ర మహాభారతమునకుఁ గావ్యధర్మముల నాపాదించినాఁడు.

సోమయాజి ప్రకృతి వర్ణనము లత్యంత నిశితములు. విరాటపర్వమున నతఁడు గావించిన సూర్యోదయ సూర్యాస్తమయాది ప్రకృతివర్ణనలు తరువాతి కాలమునఁ బెంపొందిన విపుల ప్రబంధ వర్ణనా

విధానములకుఁ బ్రాతిపదికములై నవి. సూర్యోదయము నీ కవి భావించిన విధాన మెంత పవిత్రమో పరికింపుఁడు.

సీ॥ నీరజాకరములు నిష్ఠమైఁ జేసిన
భవ్య తపంబున ఫల మనంగ
దివసముఖాభినందిత చక్రయుగ్మకం
బుల యనురాగంపుఁ బ్రో వనంగ
హరిహర బ్రహ్మ మహానుభావంబు లొ
క్కటి గాఁగఁ గరఁగిన గుటికయనంగ
సతుల వేదత్రయ లతికాచయము పెను
పొందఁ బుట్టెడు మూలకంద మనఁగ
నఖిల జగముల కన్నైర యగుచు జనన
మాజకరపుట హృదయ సరోజములకు
ముకుళనంబును జృంభణంబును నొసఁగి
భానుబింబంబు పూర్వాద్రిపై వెలింగె॥

ఇట్లే సూర్యాస్తమయ చంద్రోదయ వర్ణనలు కాముకచిత్త ప్రవృత్తి కనుగుణముగ భావనాచమత్కృతి కాలవాలములై ప్రబంధరీతి కొలవడి దిద్దు చున్నవి.

క॥ ఇనుఁడు దనకడకు నేతెం
చినరాగముఁ బొందు టది యుచిత మనఁ గాఁ గెం
పున మెఱసి పశ్చిమాశాం
గన జనసంభావనముల గారవ మందెన్॥

సీ॥ నలువ చెందొవల రేకులకు నన్నువెట్టఁ
గోరి కావించిన గుళిక యనఁగ
"నఖిల ద్విజ శ్రేష్ఠ మగు చకోర చయంబు
తపము సముల్లసత్ఫల మనంగఁ

బూర్వపయోరాశిపొంతc గెంజాయచె
న్నొందవిన పవడంపుc బొద యనంగc
జిగురుజొంపము నను జిగి యొప్ప నుదయాద్రిc
బొలుపారు నవకల్పభూజ మనcగ.
నరుణరుచి తనమండల మతిశయిల్లc
బొడిచి దివిc బ్రాకి దీధితు లడరcజేసి
యంతకంతకు నెక్కుచు నంతమనముc
గాలుకొనసీక చంద్రుcడు గ్రాలె నధిప".

అల్పాక్షరముల నిట్టి యనల్పభావోపేతముగ నుత్ప్రేక్షించుట తిక్కన యట్టి కవి బ్రహ్మకే తగును.

కీచకుని కాముకప్రవృత్తి కనుగుణము లగు వనశకుంతముల విహారవర్ణన మాతని నుద్దేకింపc జేయునదియై రసపోషణమున కెట్లుపకరించుచున్నదో తిలకింపుము.

"ఇంపైన ప్రియ కాన నిచ్చి నిల్చిన మధు
వాదట నాను మత్తాలివిభునిc
జెట్టుపల్లచరించి చుట్టుcగమ్మతి మనో
రమ నియ్యకొలుపు మరాళవిభుని
ఫలరస మొండొంటి కెలమిc జంచుల నిచ్చు
మెయినc జొక్కెడు శుకమిథునములను
గమిc బాసి తలిరుజొంపమునకు మెయిమెయిc
దాకంగc జను పికదంపతులను"

ప్రకృతినుండి చక్కని యుపమానములc గైకొనుటలోc దిక్కన కాళిదాసుc డంతటివాcడు.

నన్నిచోడునికుమారసంభవమునc గల యనేక ప్రకృతివర్ణనలు సంస్కృతాధారములు. అటనట స్వోపజ్ఞజనకములును గలవు. కాళి

దాసుని పార్వతి "సంచారిణీ పల్లవినీ లత". ఈతని పార్వతి "పుష్పిత జంగమలతల నడిమి కల్పలత". కవికులగురు వగు కాళిదాసునిసైతము మురిపింపఁ గల ప్రకృతి వర్ణనా వైశారద్య మతని కవిత్వమందలి యన్నందులకీ క్రిందిపద్యము ప్రబల నిదర్శనము.

సీ॥ మొన లావులించి వానన నల్ల బసిగొని
ఱేఁ డేటిగము లెంగులింపకుండ
నెడ సూటిగొని వేది నుడియు తెమ్మెరలకేఁ
బోడము పుప్పొడి వాలివోవకుండ
తరణి కూటమున మేఁ మెరలి పద్మినిమేన
మొలలెంచు మధుమద మొలుకకుండ
మేల్కొని గోమిని మెలఁగి, మైమురిసిన
బోదిగొన్నయకరువుల్ సెదరకుండ
తే॥ దెలిసి జక్కవలొండొంటి గలయఁ దారు
కలకలంబున రేకులు గదలకుండ
మున్నకొనివచ్చి గణికాసమూహితోడ
గిరిజ పూజించెఁ బసిడితామరల వరదు"

ఇట్టి వా యా పట్టుల ననేకములు. గజక్రీడలు, వేటాముటలు వర్ణించుటలో నీతఁడు సిద్ధహస్తుఁడు.

శివకవులలో నుత్తముఁ డగు పాల్కురికి సోమనాథుఁడు, సుసిశిత మైన ప్రకృతి పరిశీలనము కలవాఁడు. సంస్కృతవాఙ్మయపు వాసన నంటనీయక, కోడికూఁత నెట్లీ కవి వర్ణించెనో పరికింపుఁడు.

"తొలికోడి కనువిచ్చి నిలచి మై వంచి
జలజల ఱెక్కల నడలించి నీల్గి
గ్రిక్కనఁ గాలార్చి కంఠంబు విచ్చి
ముక్కున నీకలు చక్కొల్పి, కడుపు
లెక్కించి మెడసాచి నిక్కి మి న్నూచి
'కొక్కొరోకుర్' అని కూసె"

ప్రబంధకవుల కుక్కురములు ప్రకృతి జన్యములు కాక వారి మస్తిష్క జన్యము లౌట దీనిలోని సహజ సౌందర్య మందుఁ గొఱంతేవడును.

పాల్కురికి సోమన్న చూపిన సహజ మగు తెనుఁగు శక్తిమార్గమునఁ గోనబుద్ధారెడ్డి తన రామాయణ మధురగానము గావించినాఁడు. చంద్రవర్ణనమం దెట్టి నిరాడంబరసహజభావోపేత మో!!

"పాలు పొందు కలువలపోరాని విందు
కలసిన జక్కవకవఁ బాపు మందు
పాలవెల్లిని ద్రచ్చి పడసిన వెన్న
శూలియాడలపువ్వు చుక్కలనవ్వు
నెఱి చకోరములకు నెలనెలపంట
యుఱవేది విరహుల నుడికించు మంట
హరిహర బ్రహ్మల యానందదృష్టి
సరసిజరిపుఁ డైన చంద్రుండు పొడిచె."

ఈ మార్గ మిట్లుండ, నాంధ్ర వాఙ్మయాంబరమున "స్ఫురదరుణాంశు రాగరుచి"వలె నెఱ్ఱాప్రెగడ యవతరించెను. కథాకథనమునకు రంగభూమిగ విపుల మగు ప్రకృతి వర్ణనములఁ గావించి యీతఁడు ప్రబంధ పరమేశ్వరత్వము నందినవాఁడు. భారతారణ్యశేషమునే కాక నృసింహపురాణాదులయందును నీతఁడు తన ప్రకృతివర్ణనానైశాల్యమును బ్రకటించి, వానికి కావ్యత్వ మాపాదింపఁజేసినాఁడు. రసోచిత మగు నీ వర్ణనము నిజముగఁ గవితాపులమమారుతము వీచిన తరంగమునకు హాయి గొల్పుచున్నది.

"ఇదె చనుదెంచెఁ జైత్రుఁ డని యెల్లవనంబులకుఁ బ్రమోదముల్
వొదలఁగ మేలివార్తగొని బోరన వచ్చిన దాడికాఁ డనన్
మృదువనదేశౌముఖసమీర మెసఁగ్కెన నల్లసిల్లె నిం
పొదవఁగ దక్షిణానిల మనూనమనోహరఖేలనంబునన్".

కమ్మతెమ్మెరలవలె డెందము నలరించు నీ వర్ణనలలో శంభుదాసుని జాను తెనుఁగు వర్ణనావిశిష్టత విశదమగుచున్నది.

గీ॥ పొగడమాఁకుల మొదలను బువ్వరసము
తొఱఁగి నెత్తావియుందున నెఱయ నొప్ప ॥
బూచుకొఱకు మున్ను నింపులు దలిర్ప
గడఁగి వనలక్ష్మి యుమిసిన కల్లయనఁగ ॥॥

గీ॥ అదిరిపాటున వేసవి పొదిలికొనినఁ
గలఁగి కదలి పోనేరక మలయపవనుఁ
డిందుఁ దలదాఁపుకొనియెనో యిప్పు డనఁగ
నమరు దాళవృంతముల మందానిలంబు॥

సీ॥ చిఱుసానఁ బట్టించి చికిలిసేయించిన
గండ్రగొడ్డలి నిశాగహన లతికఁ
గాఱుకొన్న నిబిడాంధకారధారాచ్ఛటా
సత్రివాటికి వీతిహోత్రజిహ్వ
నక్షత్రకుముదకాననము గిల్లెడుబోఁటి
ప్రాచి నెత్తిన హస్తపల్లవాగ్ర
మనసి మింటికిఁ గంటి కైక్య సందేహంబుఁ
బరిహరింపఁగఁ బొలుపడ్డ యవధి
సృష్టికట్టెఱ తొలినంజ చెలిమికాఁడు
కంటువిన తామహాదేవికొడుకుఁగుఱ్ఱ ....
సవితృసారథి కట్టెఱచాయ దెలుప
నరుణుఁ డుదయించెఁ బ్రాగ్దిగాభ్యంతరమున.

అనుచు కీవిగుఱ్ఱ భద్రగజవు నడలతోఁ బ్రత్యక్షమగుచున్నాఁడు శ్రీనాథ కవి సార్వభౌముఁడు. ఇతని ప్రకృతివర్ణనము లన్నియు సంస్కృతపు నొరవడిని బడి స్వకీయోపజ్ఞాముద్రచే విభాసితములు. పోతన్న

కోశములోని పదము లన్నియు నొక్కచోఁ జేర్చి కూర్చినట్లు వృక్షజాతుల నన్నిటిని సమీకరించి పద్యము లల్లెను. వానిని మున్నతమగు ప్రకృతి వర్ణనము లనఁజాలము.

ఉ॥ అందుఁ దమాల, మాల, వకు ళార్జున నింబ కదంబ పాటలీ
చందన నారికేళ ఘనసార శిరీష లవంగ లుంగ పూ
కందుక చందన క్రముక కాంచన బిల్వ కపిత్థ మల్లికా
కుంద మధూక మంజులనికుంజములం దనరారి వెండియున్.

ఇట్టి వాంధ్ర వాఙ్మయమున నితరకవులయందును లెక్కకు మిక్కిలిగాఁ బొడఁగట్టును. "ఇట్టివిగూడ ప్రకృతివర్ణనలే యైనచో వస్తుగుణదీపిక నుత్తమ మగు ప్రకృతివర్ణనాగ్రంథముగ నెన్నవలయును" నను రామలింగారెడ్డిగారి హాస్యోక్తి మఱువరానిది.

పెద్దన, తిక్కనాదులమాట యటుంచి ప్రబంధకవులప్రకృతివిధాన మంతయు నొక్కయచ్చునఁ బోసినయట్లుండు నని స్థూలముగ నూహింపవచ్చును. ప్రబంధకవితాపితామహుఁ డగు నల్లసాని పెద్దన హిమాలయ పర్వతములఁ గొంత తన మనోవీథిని జిత్రించుకొని వర్ణింప నారంభించెను. అవి పెనుగొండ పరిసరముల వర్ణనలని పెద్దలయభిప్రాయము. "తుహిన భూధర శృంగ శ్యామల కోమల కానన హేమాఢ్యదరీఝరీనిరీక్షాపేక్ష"తోఁ బ్రవరుఁ డరిగెను. అచ్చో "ఉల్లలదలకాజలకణ, పల్లవితకదంబముకుళపరిమళలహరీహల్లోహలమదబంభర, మల్లధ్వను లెసఁగ మరుదంకురములు" విసరెను.

....

....

దృగ్విదాహచ్ఛిదావినిద్రాణమదవ
దంజనాలాపమూలశయ్యావిధాన
తోరణాధోరణాకల్పితోరుశోణ
మృత్తికారాశిమో యన" సంధ్య మెఱసెను.

సూర్యబింబము సాయంకాలము రక్తవర్ణము దాల్చెననుటకుఁ బ్రవరుఁడు వరూథినీవాంఛితముఁ దీర్పక వంతలఁ బడఁద్రోసి పోవుటచేఁ గల్గు నాగ్రహమే కారణముగా వర్ణించిన యీ పద్య మౌచిత్యముచే విరాజితము. నిక్కమునకుఁ బ్రకృతివర్ణన లిట్లు కావ్యపాత్రలతోఁ బ్రకృష్ట బంధములు గల్గి యలరారవలయును.

"తరుణి వసన్తకాంత నతిదారుణపుష్పశిలీముఖవ్యథా
భరవివశాంగి సంగభవుబారికి నగ్గముసేసి క్రూరుఁడై
యరిగె మహీసురాధముఁ డహంకృతితో నని రోషభీషణ
స్ఫురణ వహించెనో యన నభోమణి దాల్చెఁ గషాయదీధితిన్"

సాయంతన సమయముల రాయలతో మృగయావినోదముల సందర్శించు పట్లఁ బరికించిన ప్రకృతి నెట్లు వర్ణించుచున్నాఁడో గమనింప నగు నీ పద్యమున.

శా॥ "శ్రేణుల్ గట్టి నభోంతరాళమునఁ బాఱెన్ బక్షు; లుష్ణాంశుపా
షాణవ్రాతము కోష్ణ మయ్యె; మృగతృష్ణావార్ధి లింకెన్;జపా
శోణం బయ్యెఁ బతంగబింబము; దిశాస్తోమంబు శోభాదరి
ద్రాణం బయ్యె; సరోజషండములు నిద్రాణంబు లయ్యెన్ గడున్

చంద్రునిలోఁ గనంబడు నీలిమను గవులు పెక్కురీతుల వర్ణించిరి. పెద్దన గావించిన యీ క్రింది కల్పన మపురూపము. ఇట్టి వర్ణనలు కొన్ని పెద్దన్న పెద్దతికమును నిలఁబెట్టుచున్నవి. అందులకు ముఖ్యహేతు వా వర్ణన లితివృత్తముతోఁ బెనవేసికొని యౌచిత్యముతో నట్టివడు చుండుటయే

చ॥ "మరున కొనంగఁ గాలము తమశ్ఛట కాటుకగా నవోదయ
స్ఫురదరుణప్రభావధికశోణితసిక్తసితోడుభుక్తముల్
హరిహయదిఙ్నభస్స్థలమునన్ బలి చల్లి వటాంకముల్ వసూ
త్కరభరితంబునై వెలుఁగఁ గాంచి సుధానిధి నెత్తె నత్తఱిన్.

ముక్కుతిమ్మనార్యుని ముద్దుకవితాలత, ప్రకృతి సౌందర్యసౌరభవిభాసితము. శ్రీకృష్ణుఁడు సత్యభామకు మేరువును వర్ణించి చెప్పుటలోఁ బాత్రోచితమైన వర్ణనాప్రాగల్భ్యము సుప్రకటితము.

సీ॥ జీర్ణపర్ణద్రుసంకీర్ణాహిమణిదీభా
 మాయాకిసలవంచ్యమానపికము
శశికాంతరుచి మృషాసలిల సంక్షాలన
 శ్లథవిషాణోద్విగ్నసైరిభంబు
గోమేధిక ప్రభాంకూర మిథ్యామధు
 ద్రవలిలిక్షామిళద్భల్లుకంబు
నీలగండప్రస్తరాళీకగజభేద
 శీర్యన్నఖక్షుబ్ధసింహకులము"

తే॥ "గారుడాశ్మచ్ఛవిచ్ఛటాకపటయవస
పూళికాచర్వణవ్యగ్ర బాలమృగవి
లంఘ్యమానాబ్జరాగశిలావితాన
కూటదావాగ్ని యదె మరుత్కుధర మబల.

ంతటి రమణీయ భయంకరమైన మేరువునందు సంచరించు చెంచెతల ంతటి తేటమాటలతో వర్ణించెనో!

"వంచనఁ బొంచి చేరవకు వచ్చిన చంద్రుని జింక సేసి హ
రించియుఁ దత్సుధారసని షేచనచే నవి చావకున్కి వీ
క్షించియు నేటుదప్పె నని చే విలు నమ్ములుఁ బాఱవైచి ల
జ్జించి చరించుచుండుదురు చెంచెత లగ్గిరిసానుభూములన్."

సాయంకాల వర్ణనలు", "చంద్రికా విహారములు", "సూర్యాస్తమ రాది వర్ణనములు" మనోజ్ఞమనురములై ముక్కుతిమ్మనార్యుని ుద్దుకైతకు ముచ్చటలైన యుదాహరణములేకాని యీ వర్ణన లిటి

వృత్తమునుండి విడదీయరానంత గాఢబంధము కలవి కాకుండుట విచార్యము.

వసుచరిత్రకారుని గిరిక ప్రకృతిదేవికి ముద్దు బిడ్డ. గిరిక బాల్యజీవిత మంతయు నొక చక్కని ప్రకృతివర్ణనాప్రబంధము. శుక్తిమతీకోలాహలసమాగమవర్ణనములోని శ్లేషమాధుర్యము భట్టుమూర్తి ప్రతిభను సుప్రథిత మొనర్చుచున్నది.

రాయలు నిరంతర ప్రకృతిపరిశీలనతత్పరుఁడు. ఆముక్తమాల్యద యందలి గ్రీష్మవర్ణన, వర్షర్తు వర్ణన లతి దీర్ఘములై వస్తైక్యమును జెఱచినను, అందలి ప్రగాఢ మగు కల్పనాశక్తి, ఊహాశక్తి (Imagination and Fancy) ఆంధ్ర వాఙ్మయమున మఱియొకచోఁ గాన్పింపనివి. ఈతనిప్రకృతి వర్ణనములు ద్వివిధములుగా శ్రీ పిలకా గణపతిశాస్త్రిగారు విభజించిరి. (1) కవిభావనాముద్రితముకాని సహజ మగు ప్రకృతి వర్ణనలు. ఇందుఁ గవిభావన మంతర్లీనమై లుప్తప్రాయముగ నుండును. ఇందుల కుదాహరణ మచ్యుతమజ్జనార్థమై చెంగల్వాడిగ్గియ నీరుకొని, దివ్య ప్రబంధము పాడుకొనుచు వచ్చు ద్రావిడాంగనావర్ణన మెంతేని సహజము.

> "శయపూజాంబుజముల్ ఘటిం పడఁబడఁ జన్దోయి లేఁగానుపై
> దయ తప్పక బసుపాడి, పాగడపుఁ బాదంబొప్పఁ జెంగల్వడి
> గ్గియనీ రచ్యుతమజ్జనార్థము కటిం గీలించి దివ్య ప్రబం
> ధయుగాస్యల్ ద్రవిడాంగనల్ నడతురుద్యానంపులోత్రోవలన్"

ప్రకృతి నాలంబము గావించుకొని కవిభావన యలంకారాదులసహకారముతో విశృంఖలముగ విజృంభించుట ప్రకృతియందు నూతప్రాయము. చూడుఁడు.

"కలయన్ నీలమయంపుఁ దల్లి యొఱదాకం దేటనీ రొప్పు ర
థ్యలకూపంబుల మీలఁ జూచి, వలభీవ్యాసంగితుంగద్రుశా
ఖలలో నుండి గుభాలునన్ లకుముకుల్ క్రిందై పడున్, లేచు, మూ
ర్ఛిలి గేహేందిర ద్రావిడీపరిచితిన్ జెందాడు చందంబునన్."

కవికి నుండనగు నుత్ప్రేక్షా శక్తి, పారము ముట్టిన దీ సాహితీ సమరాంగణ సార్వభౌమునిలో.

మాఱుమూలలఁ గల ప్రకృతి స్వభావములఁ జిత్రించుటలో నీతని కీడైన కవి వాఙ్మయమున లేఁడనవచ్చును. (1) మేడిపండు లోనికి వర్షపు నీరెక్కినపు డందుండి దోమల పంక్తులు వెడలుట. (2) మాలదాసరి కథలోని వటవృక్షవర్ణన—అందున మర్రియాకు లను బురుగులు కొట్టివేయఁగా నేర్పడిన గీఱల వర్ణన, (3) కల్పాంతరములలో నిద్రించు జాతువుల వర్ణన, ఇంకను నిట్టి వనేకములు "రవి గాననిచోఁ గవి గాంచు నేకదా" యను సూక్తిలోని సత్యమును నిలువఁ బెట్టుచున్నవి. కాని వీనికిఁ గథతో నేమాత్రము సంబంధము లేకపోవుటచేఁ బ్రథమ శ్రేణికిఁ జెందిన వర్ణనలుగాఁ బరిగణించుటకు వీలుపడదు.

ప్రబంధ కవులలోఁ బింగళి సూరన ప్రకృతి వర్ణనలయందును దన పార్థక్యమును జూపెట్టినాఁడు. ప్రతి వర్ణనము నతఁడు చక్కని ధ్వనిమయముగను, కథా ప్రకృష్టసంబంధిగను గూర్చి తన విశిష్టతను ప్రదర్శించెను.

"విలసితవీచికాయత రవిప్రతిబింబమిషంబునన్ మహా
జలనిధి లక్ష్యపార్శ్వచయచక్రిపయిం జెయిచాచి యొప్పు సం
ధ్యలఁ బురలక్ష్మిధర్మవిధు లన్నియు నోజ్జలపుచ్చకాయగా
వలయు విడండతెండు రసవత్పరిఖామిష బాహుబంధమున్"

అను నీ సముద్రవర్ణనము భావికథ కంతకును సూచ్యార్థసూచికగా నొప్పుచున్నది.

మణిస్తంభుఁడు సుముఖాసక్తికిఁ జూపుచుఁ జేయు సముద్ర వర్ణనము, అందు తిమింగల శిరోరంధ్ర ప్రసంగము తరువాతి క యగు నలఘువ్రతుని చరిత్రయం దతని భార్యలు తిమింగలముచే గ్రసింపఁబడి తిరిగి దాని శిరోరంధ్రమునుండి చిమ్మఁబడిన నీటిలోఁ బ గగనమున కెగియుట ప్రాతిపదికము. అంతియేకాక ప్రకృతకథలో విరాగ దంపతులను సరాగులుగ మార్చుట కుద్దీపనము. ఇట్టి వర్ణ ములే నిజమునకు సార్థకములు. కవికిఁ గావ్యమునకుఁ జరితార్థదాయ ములు.

"ఒక విషయమునుబట్టి చూచిన సరస్వతీ చతుర్ముఖ విలాసము వంటి ఘట్ట మాంధ్రమున నెక్కడను లేదు. ఏ విషయ మనఁ బ్రకృతిని పాత్రముల జీవితముతోఁ గలసినట్లు వర్ణించుట" యను రామలింగా రెడ్డిగారి వాక్యము సత్యసమ్మతము.

తరువాత నాంధ్ర వాఙ్మయమునకు క్షీణయుగము. గతానుగతికములైన రచనలు తామరతంపరలుగ వెలసినవి. వానిలో నెచ్చోటనైన" నిజారులలో "బయానస్సెన్సులవలె నొకటి రెండు ప్రకృతివర్ణనలు స్వోపజ్ఞకములు పొడఁగట్టనగును గాని కష్టమునకుఁ దగిన ప్రతిఫలము గిట్ట దని నాశంక.

ఆధునికాంధ్ర వాఙ్మయ మాంగ్లవాఙ్మయము ననుకరించి యభివృద్ధి జెందినది. ఆధునికకవు లాంగ్లమున Wordsworth, Shelly, Keats మున్నగు కవులవలెఁ బ్రకృత్యుపాసనా తత్పరులై ప యిగ, స్వేచ్ఛగ ప్రకృతిలోని స్పందనమునకుఁ దన హృదయమును స్పందించి కవన మల్లిరి. అనుకరణముతోఁ దొలుత ప్రారంభమైన కాలాంతరమున నవ్యకవులలోఁ బ్రకృతివర్ణనము స్వకీయప్రతిభావిలసితముగ విరాజిల్లినది. "ఋతువున కొక రుచిరాలంకృతిఁ గొని సవదరించి యభినయించెడి సృష్టిస్థితిలయ యోగిని"గా శ్రీ రాయప్రోలు సుబ్బారావు కవిగారు ప్రకృతిని పునీతముగా దర్శించిన ధన్యత నంపాదించుకొనిరి.

"సతతనూతన మృదువిలాస ప్రభూత
శావక మనోజ్ఞలాస్య సందర్శనమున
నాదు భావాలు మధురగానమ్ము సలిపె
ప్రకృతి యానందతన్మయత్వమున మునిఁగి"

అని తన యానందమును వెల్లడించుచున్నాఁ డొక నవ్యకవి. ఆకులో ఆకునై పూవులోఁ బూవునై, కొమ్మలో కొమ్మనై నను లేత మ్మనై, యీయడవి దాఁగిపోనా ? చిరుగాలి కెరటమై, సెలయేటి పాటలో తేటనై పోనా!" అని యేమి చేయుటకును దోఁచక స్తబ్ధుఁడైనాఁ క భావకవి. అతఁడే మఱియొక సమయమునఁ దన భావకవిత్వపక్ష ముల విహంగత్వము వహించి "దిగిరాను, దిగిరాను దివినుండి భువికి" ని సంతోషమునఁ గేకలువెట్టుచున్నాఁడు. మఱియొక మభినవ కవీ వుఁడు "మామిడికొమ్మమీఁద కల మంత్రపరాయణుఁడైన కోకిల స్వామి"కి మ్రొక్కుచున్నాఁడు. అతఁడు "కానఁబడక, అనుమానప్రమా ణమున నందియునందని పరమతత్త్వ మవలనుంచి పంచభూతదృశ్యం బైన ప్రకృతి యొకటి" తనకు లక్ష్య మని విశద మొనర్చుచున్నాఁడు. తన కత్యంత ప్రియులగు బాంధవులను, తల్లిని, ప్రేయసిని, సోదరిని ప్రకృతియందే ర్శించుచుఁ దృప్తిఁ జెందుచున్నాఁడఁట.

ఇట్టి యాధునికాంధ్రకవుల ప్రకృతి తాదాత్మ్యముపై విశ్వకవి వీంద్రుని ప్రభావముగూడ నెంతో ప్రసరించినది.

విశ్వనాథ వారి "కిన్నెరసాని పాటలు", "ఋతుసంహారము" సునిశితపరిశీలనఫల మగు ప్రకృతివర్ణనలతోఁ గూడినవి. పింగళి, కాటూరి వారల "తొలకరి" ఆచార్య సుబ్బారావుగారి "తెనుఁగుతోట" తెనుఁగు ప్రకృతికి దర్పణములు.

అచ్చముగాఁ బ్రకృతి దృశ్యములను వర్ణించుటలోనే తనియక నవ్య వులజాతికి జీవగఱ్ఱ యగు రైతును, గ్రామీణ దృశ్యములను బ్రకృతికి

ముద్దు బిడ్డలుగ జీవించు పల్లెపడుచులను, తన కవిత్వమున కితివృత్తము గావించినారు. ఆంగ్లమున Wordsworth "Solitary reaper" మున్నగు ఖండకావ్యములు వీరి కిందు మార్గదర్శకములైనవి.

శ్రీ ఏటుకూరి వెంకటనరసయ్య "క్షేత్రలక్ష్మి", దువ్వూరివారి "కృషీలవుడు" రైతుయొక్క స్వార్థరహితజీవన విధానప్రాశస్త్యమును ప్రదర్శించుచున్నవి.

"రారమ్మోయి! కవీశ్వరా! హృదయమర్మక్షేత్రముం దున్ని సం
స్కారాసన్న ఫలమ్ము నందుటకు స్వర్గస్థానమం దుండెరా
వారే రైతులు విశ్వజీవనకళపారంగతుల్ నీ కవి
త్వారంభమ్మున కిద్ది స్వర్ణయుగ మన్నా, నాటికిన్ నేటికిన్"

అని వీరుల ప్రబోధము.

దువ్వూరి రామిరెడ్డిగారి 'వనకుమారి' మధురిమంబుల ప్రకృతికావ్యము.
శ్రీ నండూరి సుబ్బారావు, కవికొండల వెంకటరావు, అడవి బాపిరాజు మున్నగు నవ్యకవులు సహజసౌందర్యవిలసిత మగు జానపదులజీవితము వర్ణించి నూత్నమార్గముల వెల్వరించిరి.

నండూరివారి 'యెంకికి' "తోట పూల మనసులు తెలుసు"
బాపిరాజుగారు పడవవారితోఁ బడవవాఁడై

"రావోయి సిన్నవాఁడా! మావాడరావోయి సిన్నవాడా!
అని నాటి పడవవానిని బిలిచి

"ఉబికే వాగుల్లోకి-ఉయ్యాల లూగుతు పోయి
పందరాన పుట్టేటి - సెందురూని సేరు కొండ" మని వారికి సైదోడగుచున్నాడు.

ఇట్టిది నిసర్గ మగుకైత. దీనికిఁ బాండిత్యము, కోశములు, అప్పకవీయము పనిలేదు. కవితకు జీవనమగు భావనాశక్తి యవసరము. పాల్కురికి

సోమన్న చెప్పిన తుమ్మెద పదములు, పర్వత పదములు మున్నగు మన జానపద సాహిత్యము ప్రకృతి శోభా రామణీయకము. ఇది కృతక మగు మార్గ కవిత్వపు హడావుడికిఁ దెరమఱుఁగై నది. దానిని పునరుద్ధరించి జాతీయ జీవన విధాన గ్రహణమునకుఁ దోడ్పడవలయును. జానపద కవిత్వ ప్రాశస్త్యమును Johnson పండితుఁ డిట్లు ప్రశంసించెను.

"There is scarcely any species of poetry that have allowed more readers or excited more writers than the pastoral. pastoral is a way out of "cares and peturbations into Elysian regions, where we are to meet with nothing but joy end contentment".

జానపద కవిత్వ మల్లుటకు నిరుపహతి స్థలము లుండరాదు. కవి వారిలో నొక్కఁడుగ జీవించి వారి యనుభవములను గ్రహింప వలయును. W. Irring ఆంగ్ల వాఙ్మయములోని జానపద కవిత్వ విశిష్టత నిట్లుగడించెను;

"The pestoral writers of other countries apper as if they had paid an occassional visit and became aquinted with her general charms, but British poets have lived and revelled with her".

అట్టి యున్నతస్థితిని తెనుఁగుఁగవులు గూడ నందుకొనవలయును. అపారభావనా విలసితులును, అతీంద్రియానుభవులై నఁకవులు ప్రకృతితోఁ దాదాత్మ్యము పొందినపుడే వారి రచనలకు సార్థక్యము పార్థక్యము. మన కానందైక్యము. మార్గకవితాభిమానముతోనే పరిత్యక్తులుగాక, నిసర్గకోమల మగు దేశికవితాభిమాన ప్రవృత్తులై, జాతి మనః ప్రవృత్తుల నున్మీలనముఁ జేసి, వాఙ్మయ విశిష్టతను ద్యోతమానము చేయ వలసిన బాధ్యత మనకవిపుంగవులపై నున్నది. ప్రకృతిలో జీవించి, ప్రకృతి సౌందర్యమునకుఁ బులకితులై, పతితలను బులకింపఁ జేయఁగల వాఙ్మయ మంకను నెంతయో సృజించి రససిద్ధు లగుట జాతికే గర్వకారణము !!.

శ్రీమద్రామాయణము-మానవత్వ ప్రతిష్ఠ

శ్రీ భమిడి సత్యనారాయణశర్మ.

పించుటకును గారణ మా విలక్షణతమసాతీరసన్నివేశమే. తుదకు శింశుపావృక్షమునుండి సీత నుపలక్షించుచుండిన యాంజనేయులయందు వాల్మీకి ప్రవేశించి "ఇమా మసితకేశాంతాం శతపత్రనిభేక్షణాం; సుఖార్హాం దుఃఖితాం దృష్ట్వా మమాపి వ్యథితం మనః" అని సీతదుఃఖమునందుఁ గాంచిన దుఃఖప్రతిబింబమును స్ఫురింపఁజేయుచుఁ "గాయకసరు తినునట్టి యాటవికుఁడనైన నా హృదయముగూడ నీ సీతదుఃఖముచే వ్యథ నొందుచున్న"దని తన యనుభవము నా ఋషి యుగ్గడించి యున్నాఁడు! పైఁగఁ "గావ్యం రామాయణం కృత్స్నం సీతాయా శ్చరితం మహత్" అని శ్రీమద్రామాయణము పేరుగాని యయ్యది సీతచారిత్రమే యని చెప్పునంత యుత్కృష్టస్థానము నలంకరించెను సీతామతల్లి వాల్మీకిహృదయమునందు. ఇంకఁ దార, మండోదరి, మున్నగు స్త్రీల విలాపములు కేవలహృదయవిదారకములు. అదియంతయుఁ గాంచిన దుఃఖసంజనితకరుణారసతరంగములే యందురా? కాదు; వాల్మీకి స్వీయ చరిత్రకూడఁ గొంత సీతారాముల నాలంబనముగ గ్రహించి యానాఁడు వాల్మీకి హృదయమును గలంచిన యనుభవముల నందుంచెనని నా మనవి. వాల్మీకిభార్య యగు బోయతకూడ నొక మొఱకు స్త్రీ యని మనము గ్రహింపరాదు. తారా పాత్రమును బాగుగఁ దిలకింపుఁడు! వాలికొఱ కామె యెంత దుఃఖించెను? అది నటనమా? కాదు. వాల్మీకి యొనరించెడి దుష్కృత్యములందలి పాపమును దాను బంచుకొననని యాతనిభార్య నిరాకరించినంతమాత్రమున నా యజ్ఞురాలి నాతఁడు విడుచుట పాడియా? సీత లక్ష్మణుని నే తీరున నెన్ని దుర్భాష లాడియుండలేదు? రాముఁ డామెను గాదని వదలెనా? తార తన భర్తతోఁగూడ

మృతి నొందెద నని చెప్పెను. కాని తుదకు సుగ్రీవుని యామె చేపట్టక
తప్పలేదు. ఆ తీరున వాల్మీకిభార్య యగు నా బోయతగూడ చేసియుం
డవచ్చును. ఆ కాలమునం దా యాటవికస్త్రీల కది ధర్మము కావచ్చును.
అంతమాత్రమున కాతఁడు తన స్త్రీని విడిపోవుట తగియుండలే దని
నాఁటిక్రౌంచీరోదనముచే నాతని హృదయము కరఁగిపోయెను! అందుచే
నాతనిమానస మా దినమున నొక యగ్నిపర్వతమువలె నుడుకసాగె
ను విషయ మీ వఱకె చెప్పియుంటిని. ఈ రీతిగ శ్రీమద్రామాయణము
నందు విషమఘట్టము లనేకములు మానవుల నెటుల శోకాకులపఱచుచుం
డునో చర్చించి శ్రీరామచంద్రుఁ డే తీరున మానవమాత్రునివలె సంచ
రించి వాని నన్నిటిని దన నిశితధర్మపరిపాలనముచే నట్టి విషమవిషయ
ములను జయింపఁగలిగెనో నిరూపించెను. ఆ యా విషయములు చర్చిం
చుటకుఁ బాఠకమహాశయులకు విన్నవించుకొందును. ఏది యె ట్లున్నను
వాల్మీకి మతమునందు స్త్రీస్వరూపము కేవల మొక త్యాగమూర్తి
యనియు, నామె పరమపవిత్ర మగు వస్తు వనియు, నామె నెల్లప్పుడు
నట్టి విషమపరిస్థితులయందును గౌరవింపవలయునే కాని యామె నొక
తుచ్ఛ మగు భోగ్యవస్తువుగ గ్రహించుట పురుషునియందలి యక్షమ
మయ మగు లోప మనియు నా మహాశయునినిశ్చయ మని యాతని
కృతి చాటుచున్నది. ఈ రహస్యమును గ్రహించిన మహాత్ముఁ డీ
కలియుగంబున, త్యాగయ్య యొక్కఁడే యని చెప్పిన సాహసోక్తి
కాదు. స్త్రీవలననే పురుషున కుత్తేజము కలుగునుగాని కేవలపురుషుని
వలన నీ జగమునందుఁ బౌరుషము, గౌరవము, విజ్ఞానము, వీర్యసాహ
సాది మహాపురుషలక్షణములు కలుగనేఱ వని వాల్మీకి మతము. అం
దులకుఁ దార్కాణముగ గమనింపుఁడు; పదునాలుగు వేల దుష్టరాక్షసుల
నర్ధాధికముహూర్తంబునం బొరిఁగొన్న జగదేకవీరుఁ డగు రాముఁడు
రావణసంహారమునకై యేడహోరాత్రంబులు యుద్ధము సలుపవల

సివచ్చెను! కారణ మేమి? జనస్థాన యుద్ధమునందుఁ దన కెదురుగ యుండెను. ఆ వీరమహిళాపి. తనభర్తను జూచుచు నాతనివీరవిహారము దన నిశితకటాక్షపంక్తిని దోఁచు నల్పుచుండెను! సీత తన్ను నరణ్య మునకుఁ గొంపోవ శ్రీరాముఁడు నిరాకరించినప్పు డేమనెను! "వ నస్య శూరస్య చర్యా తే మను రోచతే" అని వనవాసమున రామచంద్రుఁ డే రీతి ప్రవర్తింపఁగలడో నా మహావీరకాంత చూ డలంచెను! కావున స్త్రీ యను వ్యక్తి, పురుషునకు మహత్తర నిచ్చెడి 'కళత్రము'. 'కళత్ర' మనఁగా నేమి? పురుషస్య క త్రాయత, ఇతి, కళత్రమ్' అని దానికి వ్యుత్పత్త్యర్థము కాదా? దా "దేశేదేశే కళత్రాణి దేశే దేశే చ బాంధవాః; తం తు దేశ పశ్యామి యత్ర భ్రాతా సహోదరః" యను శ్లోకమునందుఁ బూ వాల్మీకి విశదీకరించియున్నాఁడు. ఈ శ్లోకమున కర్థమును నిర్ణ చుటలో మనవారు స్త్రీలన శ్రీరాముఁడు చాల చుల్కనగఁ జూచిన నన్వయించి భార్య లెల్లెడల నున్నారుకాని లక్ష్మణునియట్టి సోద డెచ్చటను గాన రాఁ డని యర్థము చెప్పుచుందురు. అయ్యది వా సమ్మతమైన భావముగఁ గన్పట్టదు. శ్రీరాముఁ డా తీరున " దేశే కళత్రాణి"యని చెప్పుటలోఁ దన భార్య యొక్క లెయే తన దపూర్వానురాగము చూపునట్టి వనిత కా దనియు, నట్టి మహా మాతలు పెక్కండ్రు "కళత్ర"ము లనేకప్రదేశముల నరుంధతి, సా దమయంతి, అనసూయ, మున్నగువార లెందఱో కల రనియు గర్భజనితు లగు సోదరులే యొకరినొకరు చంపుకొనుట తటస్థించు భిన్నోదరుఁ డగు లక్ష్మణునియట్టి సర్వపరిత్యాగి మృగ్య మనియు కవియభిప్రాయ మని నా మనవి. అంతు నొకవంక స్త్రీ గారు చెడకుండ సౌభ్రాతృత్వ మన నెట్టు లుండవలయునో చెప్పుటవా మతము. పురుషునికళలను స్త్రీ యెట్టుల రక్షించునో మనకు రా

యణమునందు జనస్థానయుద్ధానంతర మీ తీరున వాల్మీకి ప్రకాశించెను.

> "శ్లో. తం దృష్ట్వా శత్రుహన్తారం మహర్షీణాం సుఖావహం
> బభూవ హృష్టా వైదేహీ భర్తారం పరిషస్వజే"
> "పునః పరిష్వజ్య శశిప్రభాననా
> బభూవ హృష్టా జనకాత్మజా తదా".

ఈ రీతి నా "శశిప్రభానన" యగు సీత శ్రీరాముని గౌఁగలించుటచే నా ఖర, దూషణ, త్రిశిరః ప్రముఖరాక్షసుల శస్త్రాదిఘాతములచేఁ గలిగిన యాఘాతము లన్నియుఁ త్రుటిలో మాయ మయ్యె నని గోవిందరాజాదులు వ్యాఖ్యానించిరి. అచ్చట "శశిప్రభానన" యను బిరుదము నా కవి సీత కిచ్చుటలో రహస్య మేమి? చంద్రుఁ డేతీరునఁ దన యమృతవృష్టిచే సమస్తలోక తాపములను బోఁగొట్టునో యా రీతిగ శ్రీరాముని యుద్ధశ్రమ మంతయు నా చంద్రముఖి యపనయించెను! ఇంతకన్న ననదృశసాదృశ్యము మనకుఁ గళత్రవిషయమున నేమి కావలెను? ఎన్ని యున్నను "భార్యామూల మిదం గృహ" మ్మనికదా పెద్దలు వచింతురు. కావున నాఁటి క్రౌంచమిథున వృత్తాంత మా తీరున మహత్తర రసస్రవంతిగ మాఱి యనన్యసామాన్యఋషి వాగ్వైభవముచే నయ్యది యా రామసాగరగామిని యయ్యె నని చెప్పకతప్పదు. కరుణారసము శృంగారరసవిచ్ఛిత్తిచేఁ గలిగిన శోకముగాని దానికి వేఱొండు స్వతంత్ర స్థానము గానరాదు. రసము లన్నిటియందును స్వతంత్రముగ నిలువఁజాలిన దొక్కవీరము. శృంగారమునకుఁగూడ దాని యాలంబన మవసరము. ఈ వీరశృంగార రసములే యీ సృష్టి కాధారము లని వాల్మీకి నిశ్చయము. తుదకు హరిశ్చంద్రోపాఖ్యానాది కరుణారస ప్రపూరితము లగునితివృత్తములుగూడ వీరశృంగారరసములయొక్క విచ్ఛిత్తిచేఁ గలిగిన శోకమోహములుగాని వేఱొండుగావు. నలోపాఖ్యానమున నేమి?

కావున శ్రీమద్రామాయణావిర్భావమునకుఁ బ్రధానకారణములు వీర
శృంగారరసానుభూతులు. కరుణారస మానాటి యనుభవముచేఁ గలిగిన
తాత్కాలికోద్రేకము. మానవజీవిత మంతయు "మరణాంతం తు జీవి
తమ్" అను వాక్యముసం దిమిడియున్న దని శ్రీరామచంద్రుఁ డనినంత
మాత్రమున మన మాతీరున నిర్ణయింపఁజనదు. అయ్యది కేవల లౌకిక
రసానుభూతికే చెల్లునుగాని, యది పరమార్థమునకుఁ జెల్ల దని వాల్మీ
యభిప్రాయము. ఆ రామావిషయములు మున్ముందు మనము తెలిసికొందు
ముగాక ! వీరుఁ డగు మానవుఁడే యమృతత్వ మొందఁగలఁ డనియు
స్త్రీ, పురుషున కట్టి వీరరసానుభూతిని దన శృంగారరసప్రవాహముచే
నెల్లవేళలయందును జాగ్రత్తఁ గాపాడుచు నీ ప్రపంచమంతయుఁ గేవల
తుచ్ఛము లగు పదార్థములలో నిండియున్నను వాని నన్నిటిని దన
ప్రేమమహిమచే నుత్తేజింపఁ జేసి యీ విషమ విషయములలో నిండిన
మానవజీవయాత్ర నొకవిలక్షణామృతపథముగ మార్చు ననియు మనకు
శ్రీమద్రామాయణము బోధించుటయే కాక స్త్రీ, పురుషు నేరీతిగ నమ
రత్వ మొందఁజేయునో కూడ వాల్మీకి యత్యంత మనోహరముగఁ జిత్రించి
మన హృదయమునందు శాశ్వతముగఁ గావ్యానందరసమును నెలకొల్పి
యున్నాఁడు. అట్టిమహత్తరకావ్యమునకు శోక మెన్నటికిని బీజము
కానేఱ దని నాయభిప్రాయము. ఏతీరున నామహాకవి శ్రీరామపాత్ర
మును లోకమున కందించెనో మన మిఁక విమర్శించుకొందుముగాక.
కామముచే కామజయమును వాల్మీకి సాధించెను. "Diomand cut
Diomand" "వజ్రం వజ్రేణ భిద్యతే" కావుననే శ్రీమద్రామాయణము
మనకు నిత్యపారాయణగ్రంథ మగుచున్నది. కామము, కామమును
జయింపఁగలదా? యని మనము సందేహింపఁబనిలేదు. దాని కీ క్రింది
వ్యాసశ్లోకమును బ్రమాణముగ నిచ్చుచున్నాను.

శ్లో. "విక్రీడితం వ్రజవధూభి రిదం చ విష్ణోః
శ్రద్ధాన్వితో ను శృణుయా దనువర్ణయే ద్యః
భక్తిం పరాం భగవతి ప్రతిలభ్య "కామం"
హృద్రోగ మా శ్వపహినో త్యచిరేణ ధీరః".

అని గోపికాక్రీడాంతమందు ఫలశ్రుతి రచించినాఁడు వ్యాసభట్టారకుఁడు. ఇందు "శ్రద్ధాన్వితః" అను పదప్రయోగమును మనము గమనింప వలెను. ఆ శ్రద్ధ యెట్టిదో మనము నిశ్చయించుకొనినచో మన కయ్యదియే యమృతత్వమును జేకూర్చును! ఆ యావన్ని వేశములు నాకు సాధ్యమైనది విపులముగఁ బాఠకలోకమున కందింప యత్నింతును. నా రచనయందే దేని యసంగతవిషయము లున్నచో నాకు విద్వాంసులు తెలిపి నన్నుగూడ సంస్కరింపఁ బ్రార్థన.

శ్రీరాముఁడు మనుష్యుఁడా?

"ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజమ్" అని శ్రీరామచంద్రుని మానవమాత్రునిగనే సంతరించుటలో వాల్మీకి యుద్దేశ మేమి?

శ్రీ రా ముఁ డు.

ఇంతవఱకు "మానిషాద ప్రతిష్ఠాం త్వ మగమ శ్శాశ్వతీ స్సమాః" అను రామాయణ ప్రాదుర్భావబీజమగు శ్లోకమునుగూర్చి యథాశక్తిగ విమర్శించి యీ కావ్యము వాల్మీకిమహర్షి యొక్క హృద్గతకామోద్రేకసంచలనశక్తిచే నుద్భవించిన విలక్షణకామధేనువువంటి దివ్యఫలప్రదాత యగు నితిహాస మని మనవి చేసియున్నాను. దీనివలన మానవులకుఁ గలుగునట్టి యలౌకిక ఫలములంగూర్చి బాలకాండ ప్రథమసర్గము నం దీ రీతిని వాకొనఁబడినది.

శ్లో. పఠన్ ద్విజో వాగృషభత్వ మీయాత్
స్యాత్ క్షత్రియో భూమిపతిత్వ మీయాత్
వణిగ్జనః పణ్యఫలత్వ మీయాత్
జనశ్చ శూద్రోఽపి మహత్త్వ మీయాత్ (1-1-100)

కావున శ్రీమద్రామాయణము మనుజునకుఁ గల్పవృక్షకామధేనువులకన్న మహత్తరఫల ప్రదాత యగుట నిస్సందేహము.

ఇఁక శ్రీరామచంద్రుఁడు మానవుం డనుటకుఁ గల కారణముల నిట దిఙ్మాత్రముగఁబొందుపరచుచున్నాను. వీనివలన శ్రీరాముని దైవముగ నారాధింపఁగూడ దని కాని వల దనిగాని,యక్కఱలే దనిగాని నాయాశయ మెంతమాత్రమును గాదని తొలుదొల్తనే నేను మనవిచేసి యున్నాను. దైవమనఁగా నెవ్వరు? అతఁడు మనుష్యరూపమున నీ లోకమునందు సంచరించె ననినం దప్పేమి? మానవుఁడుగా సంచరించి, తన మతమును లోకమునందుఁ బ్రచార మొనరించిన ఏసుక్రీస్తు, మహమ్మదు, బుద్ధభగవానుఁడు మొదలగువారు తన్మతస్థులచే దైవములుగ నారాధింపఁబడి వారికై ప్రార్థనామందిరములు వారు నిర్మించినచో నయ్యది న్యాయమా? హిందువులు శ్రీరామ శ్రీకృష్ణాద్యవతారమూర్తులను బూజించినచో నట్టివారు కాఫరులా? మతాభినివేశముతో లోకమును బీడించుటగూడ నొకమహత్తరకార్యముగ నెంచుచున్నారు నేటికిని కొందఱు దుర్మార్గులు! ఆర్షమతము, "పితృదేవోభవ," "మాతృదేవోభవ" "ఆచార్యదేవోభవ" "అతిథిదేవోభవ" తల్లిని, తండ్రిని, యాచార్యుని యతిథినిగూడ దైవముగ భావించి పూజింపవలె నని శాసించుచున్నది.శ్రీరాముఁడే యీ తీరునఁ దనతండ్రి వాక్యము చెల్లింపక తప్ప దని సీతామతల్లితో ననెను.

శ్లో. "అస్వాధీనం కథం దైవం ప్రకారై రభిరాధ్యతే
స్వాధీనం సమతిక్రమ్య మాతరం, పితరం, గురుమ్".
(2-30-33).

ఆ రీతిని శ్రీరామచంద్రుఁడు తల్లిని దండ్రిని, గురుని, నెటుల దైవములుగ భావించి పూజించెనో వాల్మీకి సూచించియున్నారు. ఆహా! ఇట్టి శ్రీమద్రామాయణాది గ్రంథములు నేఁటి విద్యార్థులు పఠించుచున్నారా? విద్యాశాఖాధికారులు బాలబాలికల కీ దివ్యకావ్యములను బఠింప నియమించుచో నేఁటి దేశమునందలి యవినీతి, యశాంతి, యవజ్ఞ యడుఁగంటి పౌరుషజ్ఞానకీర్తులు మనయువకుల మానసములందు నెలకొనవా? కోట్లకొలఁది రక్షకభటులను నియమించినంతమాత్రమున దేశమునందు శాంతి నెలకొనునా? మన దేశనాయకు లీ ముఖ్యవిషయ గమనింపక కేవల పాశ్చాత్యనాగరితా వ్యామోహచిత్తులై యూరక జీవనప్రమాణము "Standing of living" వృద్ధిచేయవలె నని యే వేవియో పథకములను దయారుచేసికొనుచు నొకజాతియొక్క నైతిక ధర్మముపై నార్థికవ్యవస్థితి యాధారపడి యున్న దనెడి మూలసూత్రమును గ్రహింపక మెలంగుటవలన నేమిలాభము?

దైవమానవశక్తులకును, మనుష్య రాక్షసశక్తులకును నెంతయో తరతమభావ ముండనక్కఱ లేదని నే నీవఱకే వక్కాణించియుంటిని.

"విముంచతి యదా కామాన్ మానవో మనసి స్థితాన్ ।
తర్హ్యేవపుండరీకాక్ష! భగవత్త్వాయ కల్పతే॥"

అని మహాభక్తాగ్రేసరుఁ డగు ప్రహ్లాదుఁడు నిర్వచించెను. కామ మన విలక్షణమగు నీశ్వరశక్తిని దుర్వినియోగ మొనరించి నీచము లగు భోగములకై దానిని దుష్ట మొనరించుటచేతనే మానవుఁడు రాక్షసుఁడగుచున్నాఁడు! దానినే తనమనోజయముచే నరికట్టి యీ ప్రకృతియందలి సర్వశక్తులను స్వాధీన మొనరించుకొని లోకోపకార మొనరించుటయే దైవశక్తి యని మనకు శ్రీమద్రామాయణము బోధించుచున్నది. చూడుఁడు! నీచ మగు కామసుఖము నపేక్షించి సీతను మ్రింగఁబోయిన శూర్పణఖను లక్ష్మణుఁడు ముక్కుచెవులం గోసి యంపెను. శ్రీకృష్ణభగ

వ్యక్తివివేకము

శ్రీ భాగవతుల కుటుంబరాయశాస్త్రి, ఎం. ఏ.,

శర్యపదమును వ్యాసపదమును బర్యాయములే యగును. సమానార్థక
లగు పదములను రెంటిని బ్రయోగించుటవలనఁ బునరుక్తిదోషమే కల్గ
అందుచే నా పదములప్రయోగమే యనుపపన్న మైనపుడు,
కిఁక సమాసము కూడునా, కూడదా యను వాదమున కవకాశమే లే
కావునఁ బారాశర్య, వ్యాసాదిపదములకు సమాసము లేకుండుట
వానికిఁ గల సమానార్థకత్వమే హేతు వని తెలియవలెను. ఇ
కుదాహరణము.

"శశాంకశేఖర, శ్శంభుః, పద్మజన్మా, పితామహః,"
యన్నియుఁ బర్యాయపదములే, కాని విశేష్యమున కతిశయాధాయ
లగుటచే సమాసమునం దంతర్భావితములు గాలేదు. ఇటులే 'త
సర్పః' ఇది సామాన్య మగు సర్పము గాదు. తక్షక మను
మనుటతోడనే సర్పమునం దసాధారణత్వము భాసించుచుండు
దక్షకత్వము విధేయము. అందుచే నిట సమాసాభావ ముచితమే.

"లోహిత స్తక్షక ఇతి సమాసోఽత్రాపి నేష్యతే
లౌహిత్యస్య విధా వుక్తన్యాయా త్తస్యాప్రవృత్తితః
స్వరూపమాత్ర ప్రోక్తౌ తు లౌహిత్యావ్యభిచారతః
ఉష్ణోఽగ్ని రితివత్ పక్షో న చా స్త్యన్య దతిక్రమే".

"లోహిత స్తక్షకః" "ఎఱ్ఱని "తక్షకుఁడు"—ఇటువంటి వాక్య
కర్థముఁ జెప్పునపుడు రెండు పక్షము లున్న వని మనము గు
ర్తించుకొనవలయును. అం దొకటి స్వరూపమాత్రప్రతిపాదనపరము
"ఉష్ణః అగ్నిః" అనునపుడు 'అగ్ని యుష్ణముగ' నున్నదని దానిస
పము, స్వభావముమాత్రమే ప్రతీతము లగును. ఉష్ణత్వము వి
మను ప్రతీతి యిచట వివక్షితముగాదు. 'లోహిత స్తక్షకః' అనున

రెండవ రీతి కనఁబడును. తక్షకశబ్దమునుండియే సర్పత్వజాతిప్రతీత మగుచున్నట్లే, ఆ జాతి సర్పములకు సహజముగ నుండు నెఱుపురంగుగూడఁ బ్రతీత మగుచు నేయుండును. అయినను బ్రత్యేకముగ లోహితశబ్దమును బ్రయోగించుటచే, లౌహిత్యమును విధేయముగఁ గవి, యుద్దేశించినాఁడని తెలియవలెను. అందుచే నిట్టితావులందు "లోహితతక్షకః" యని సమాసముఁ జేయఁగూడదు. సమాసముఁ జేసినచో లోహితత్వమునకు విధేయత్వము భాసింపదు. కావున విధ్యనువాదభావ మున్నప్పుడు సమాసముఁ జేయఁగూడ దని తెలియవలెను. ఈ రెండు రీతులే తప్ప మఱియొక రీతి లేనేలేదు.

ఇంతవఱకుఁ గర్మధారయసమాసస్థలమున సమాస మెచటఁ గూడునో యెచటఁ గూడదో చర్చించితిమి. ఇఁక బహువ్రీహిసమాసవిషయమున విచారింతము.

<u>బహువ్రీహిసమాసము చేయకుండుటవలన నర్థచమత్కారము గల్గుట కుదాహరణము.</u>

"యేన స్థలీకృతో విన్ధ్యో యేనాచాన్తః పయోనిధిః
వాతాపి స్తాపితో యేన స మునిః శ్రేయసేఽస్తు వః

అర్థము:—యేన=ఏయగస్త్యునిచేత, విన్ధ్యః=విన్ధ్యపర్వతము, స్థలీకృతః=సామాన్యస్థలముగాఁ జేయబడినదో, (పెరుఁగకుండఁ జేయఁబడినదో) యేన=ఎవనిచేత, పయోనిధిః సముద్రము, ఆచాన్తః=ఆచమనముగఁ ద్రాగఁబడినదో, యేన=ఎవనిచేత, వాతాపిః=వాతాపి యను రాక్షసుఁడు, తాపితః=బాధింపఁబడినాఁడో (చంపఁబడినాఁడో) సః మునిః=ఆముని, వః, శ్రేయసే, అస్తు=మీశ్రేయస్సున కగుఁగాక.

వింధ్యపర్వతము ప్రతిదినమును బెరిఁగెడిది. సూర్యు నావరించి, జగత్తున కంతకును జీకటిని గలుగఁజేసినది. అట్టి వింధ్యపర్వతము—

నగస్త్యుఁ డణఁచివేసినాఁడు. —సముద్రి మగాధము, నపారము
అయినను నగస్త్యుఁ డట్టి సముద్రము నాచమించినాఁడు. —వా
యను రాక్షసుఁడు, తనమాయచే నందఱను జంపివేసెడివాఁడు.
మాయావి యగు వాతాపినిగూడ నగస్త్యుఁడే సంహరించినాఁడు.

ఇచట విన్ధ్యపర్వతము నుద్దేశించి స్థలీకృతత్వము, సముద్ర
నుద్దేశించి, యాచాన్తత్వము, వాతాపి నుద్దేశించి తాపనమును వి
తము లగుచున్నవి. వింధ్యపర్వతాదుల కిట్టి దుస్థితి కలిగిన దను
యము స్పష్టముగ భాసించుట కవియభిమతము. వింధ్యాదుల
దుస్థితిని గూర్చిన యగస్త్యుఁ డఘటనఘటనాసమర్థుఁ డనియు దుష
రకారి యనియుఁ బ్రతీతి కలుగును. ఇందువలన నగస్త్యుని ప్రభావ
శయము వ్యంగ్య మగును.—స్థలీకృతత్వాదులు సమాసములో స
ర్భావము నొందక వ్యస్తములుగ నుండుటచేతనే యీ వ్యంగ్యమై
వము సాధిత మైనది. —కావున నిచట బహువ్రీహిసమాసముఁ జే
కుండుటయే యుచితము.

ప్రత్యుదాహరణము :—

"(1) యః స్థలీకృతవిన్ధ్యాద్రిః (2) ఆచాన్తాపారవారిధిః
(3) యశ్చ తాపితవాతాపిః సమునిః శ్రేయసేఽస్తు వః".

స్థలీకృతవిన్ధ్యాద్రిః —మొదలగు మూఁడు పదములును బహువ్రీ
సమాసములే — పైశ్లోకమున నున్న యర్థమే దీనికి నున్నది. కా
స్థలీకృతత్వాదులు ప్రధానముగ విధేయములై భాసించుట లేదు.
వివక్షిత మైన చమత్కారము సిద్ధింపదు. కావున నిచట బహువ్రీ
సమాస మాచిత్యభంజకమే యైనది.

కొందఱీ యుదాహరణప్రత్యుదాహరణములలో నర్థమునొక
యుత్కర్షాపకర్షలు భాసించుటయే లే దని యనుచున్నారు. వా
మే మిట్లు ప్రశ్నింతుము. అన్ని సమాసములవిషయమునఁగూడ

స్తే యర్థోత్కర్షాపకర్షలు భాసించుటలేదా? లేక కేవల బహువ్రీహి సమాసవిషయమునమాత్రమే యిట్టి శాపముతగిలినదా? సర్వసమాసములవిషయమునఁగూడ సమాసాసమాసకృత మగు నర్థభేదము మాకుఁ గన్పించుట లేదని యందురేని, సాక్షు లగు సహృదయుల నడుగుఁడనిమాత్రమే చెప్పఁగలము. మాకుమాత్రము సమాసము చేసినపుడు కలుగుప్రతీతికిని, చేయనపుడు కలుగుచున్న ప్రతీతికిని జాల భేదము కన్పడుచునేయున్నది.

బహువ్రీహిసమాసవిషయమునమాత్రమే మాకు సమాసాసమాసకృతము లగు భేదములు భాసించుట లేదందురేని క్షేమము చెప్పు సమాధాన మిది. అసమాససమాసములవలన నర్థమునం దుత్కర్షాపకర్షములు ప్రతీతము లగుచుండఁగా, ఉత్కర్షాపకర్షములకు, అసమాససమాసరూపహేతువు కనుపడుచుండఁగా, నర్థభేద మేమియును లేదని చెప్పుట యుచితము గాదు. అసమాససమాసము లను హేతువుల కర్థభేదప్రతీతిని గలుగఁజేయు సామర్థ్య మున్నపుడుగూడ నకారణముగ నర్థభేదప్రతీతి లే దందురేని, క్షిత్యాదిరూప మగు సామగ్రి యవికలముగ నున్నపుడుగూడ నంకురాదికార్యోత్పత్తి కలుగ దని యంగీకరింప వలసివచ్చును. అట్లంగీకరించుట న్యాయ్యము గాదు. అందుచేతఁ గర్మధారయసమాసమునందును, బహువ్రీహి సమాసమునందునుగూడ సమాసాసమాసకృత మగు నర్థభేదము నంగీకరింపవలయును. సమాసాభావభావము లను హేతువులు రెండు చోట్లను నున్నవిగదా! కాదందురా, రెండు స్థలములలోఁగూడ నర్థప్రతీతిభేదము లే దనుఁడు. హేతువు రెండుచోట్ల నున్నను,నొకచోటమాత్రమే యర్థభేద మున్న దనియు, రెండవచోటలే దనియుఁ జెప్పుట యర్థజరతీయమే యగును.

ఈక్రింద నీయఁబడిన యుదాహరణములందైనను, సమాసాసమాసకృత మగు ప్రతీతివైచిత్రిని, మీరు స్పష్టముగఁ జూతురుగాక. ఎచ్చట విధ్యనువాదభావమును జెప్పఁదలఁచితిమో, కవి పదార్థోపనిబం

ధనము(జేసినా(డో, యచ్చట(గూడ,వివక్షితార్థప్రాధాన్య ప్రాధాన్య మూలక మగు సమాసాభావభావములు కన్పడుచునేయున్నవి.

ఉదాహరణము :—

"సూర్యాచన్ద్రమసౌ యస్య మాతామహపితామహౌ
స్వయం వృతః పతి ర్ద్వాభ్యా మూర్వశ్యాచ భువాచ యః".

అర్థము :—

యస్య=ఏపురూరవునకు, సూర్యాచంద్రమసౌ=సూర్యచంద్రులు, మాతామహపితామహౌ = మాతామహు(డును, పితామహు(డునో, యః=ఏపురూరవు(డు, ఊర్వశ్యాచ=ఊర్వశిచేతను, భువాచ = భూమి చేతనుగూడ, స్వయంవృతః = స్వయముగ వరింప(బడిన, పతిః = భర్తయో!

సూర్యచంద్రు లిద్దఱును బ్రపంచమున కలంకారభూతులు. చరాచర మగు జగమున కంతకును ప్రాణము. భగవంతు లగునట్టి సూర్యచంద్రు లిచట ననువాద్యములు. వారి నుద్దేశించి,పురూరవమాతామహత్వ పితామహత్వములు విధింప(బడుచున్నవి.ఇట్లగుటచే(బురూరవు(డు లోకోత్తర మగు వంశమున జన్మించినా(డని తెలియుచున్నది.అందుచే నతని మహిమాతిశయము వ్యంగ్య మగుచున్నది.విశేషణవిశేష్యభావ మున్నపుడు, సమాసమున లేకుండ, వ్యస్తముగ నున్న విశేషణము,విశేష్యమునకు గుణాతిశయమును గలుగ(జేయు నని చెప్పితిమి.అటులే విధ్యనువాద భావస్థలమున(గూడ విధేయము, వ్యస్తముగ నున్నపుడే యనువాద్యమున కుత్కర్షాతిశయము గోచరించును. ఇచట ననువాద్యము లగు సూర్యచంద్రులను దెలుపు "సూర్యాచంద్రమసౌ" అనుపదములో, విధేయము లగు మాతామహత్వ పితామహత్వములను దెల్పు'మాతామహపితామహౌ' అను పదమును గలిపి బహువ్రీహి సమాసముచేయకుండుటవలననే యిప్పుడు మన మనుకొనిన యర్థాతిశయము స్ఫురించుచున్నది. సూర్యచంద్రులకు స్వరూపములో మాత్రమే యిచట భేద మున్నది. —కాని తమకు విధేయము లగు మాతామహ పితా

మహత్త్వముల మూలమున, అనఁగా బరంపరాసంబంధముచే వాక్యార్థమునకు (పురూరవునకు) మహిమాతిశయమును సంక్రమింపఁజేయుట యనుఫలితములో, భేద మే మాత్రమును లేదు. ఇట్టి విశేషప్రతీతి నారంభించియే యిచట సమాసము చేయఁబడలేదు.

ఇంకొక విశేషమునుగూడ నిచట మనము గుర్తింపవచ్చును. 'సూర్యాచంద్రమసా' అని ద్వంద్వసమాసము, వాక్యార్థమున కుత్కర్షను గలుగఁజేయుటలో సూర్యచంద్రులకుఁ గల స్పర్ధను వ్యక్తము సేయును. 'ఊర్వశ్యాచ భువాచ' అని ఊర్వశీపదమును, భూపదమును గలిపి సమాసము చేయకుండుటలోఁగూడ నౌచిత్య మున్నది. 'ఊర్వశి' పురూరవుని వరించుట వాస్తవ మగు నర్థము. —భూమి పురూరవుని వరించుట యను భావము వాస్తవముగాదు. గౌణమే—కవి ప్రౌఢోక్తి కల్పితమే. పురూరవసంవరణములో నూర్వశీ భూములకుఁ గల ముఖ్యాముఖ్యత్వభేదమును జూపుటకయియే, యిచట నాపదములను గాళిదాసమహాకవి, వ్యస్తములుగఁ బ్రయోగించినాఁ డని తెలియుచున్నది.

మఱియొక యుదాహరణము:—

"జనకో జనకో యస్యా యా తాతస్యోచితా వధూః
ఆర్యస్య గృహిణీ యా చ స్తుతి స్తస్యా స్త్రపాస్పదమ్".

అర్థము :—

యస్యాః=ఎవతెకు, జనకః రాజర్షియగు జనకమహారాజు జనకః=తండ్రియో, యా=ఏసీత, తాతస్య=నాతండ్రియగు దశరథునకు, ఉచితా=తగిన, వధూః=కోడలో, యా=ఏసీత, ఆర్యస్య—ఆర్యుఁడగు రామునకు, గృహిణీ=భార్యయో, తస్యాః స్తుతిః=ఆసీతయొక్క స్తుతి, త్రపాస్పదమ్=సిగ్గుచేటు; అట్టి మహనీయురాలిని స్తుతించుట శక్యముకాని పని యని భావము.

ఇచటఁగూడ జనకమహారాజామెతండ్రి యని చెప్పుటవలన సీతయొక్క యాభిజాత్యాతిశయము తెలియుచున్నది. 'యా జనకజనకా'

యని బహువ్రీహి సమాసమునే చేసినచో నీ యర్థవిశేషము భాసించె డిదికాదు.—ఇట్టి యుదాహరణములపరిశీలనము వలన బహువ్రీహి సమాసమునందుఁగూడ సమాసాసమాస కృత మగు నర్థభేద మున్న దనియే నిశ్చయ మగుచున్నది.

ద్విగుసమాసము :—

"ఉపపన్నం నను శివం సప్తస్వంగేషు యస్య మే
దైవీనాం మానుషీణాంచ ప్రతిహర్తా త్వ మాపదాం".

అర్థము:—(హేగురో=గురువగునో వసిష్ఠా!—దిలీపునివాక్యములు) సప్తసు, అంగేషు: స్వామ్యమాత్యసుహృత్కోశరాష్ట్ర దుర్గ బలము లను నేడు రాజ్యాంగములందును, శివం=కుశలము, ఉపపన్నం నను=యుక్తమే? యస్య=ఏ, మే=నాయొక్క దైవీనాం=దైవికములగు నట్టియు, మానుషీణాంచ=మనుష్యకృతములగునట్టియు, ఆపదాం=ఆపదలకు, త్వం=నీవు, ప్రతిహర్తా=నివారకుఁడవో".

మీ యనుగ్రహబలమున నారాజ్యమునకు సంబంధించిన యంగము లేడును బాగుగనే యున్నవని దిలీపుఁడు తన గురు వగు వసిష్ఠునితోఁ బల్కినాఁడు. ఇచట "అంగము ల నుద్దేశించి "సప్తసంఖ్య" విధేయ మగుచున్నది. సప్తసంఖ్యగల యంగములం దనుటచే, నిరవశేషముగ సమస్తాంగములం దనుటచే, నిరవశేషముగ సమస్తాంగములును బాగు గనే యున్న వని భావము వ్యక్తముకావలయును.'సప్తసు'అను విధేయ మగు సంఖ్యావాచకపదమును విడిగాఁ బ్రయోగించుటచేతనే సంపూర్ణ మైన కుశల మున్నది, యను భావము భాసించును. 'సప్తాంగేషు' యని సమాస మున్నపు డీ విశేషము భాసింపదు. అనఁగా సంఖ్యాగత మగు ప్రాధాన్యము భాసించెడిదిగాదు. దైవమానుషములు లగు రెండువిధముల యాపదలలో నేదియును, ఏరాజ్యాంగమునందును నెంతమాత్రముఁ గూడ లేదనుటచే రాజునకుఁ గల "శివోపపత్తి" (క్షేమాతిశయము)

పరిపుష్టమై భాసింపవలె నను నభిప్రాయముతోనే యిచట వ్యస్తప్రయోగ మాశ్రియింపఁబడి యుచితముగ నున్నది.

ఇంకొకయుదాహరణము :—

"నిగ్రహాత్ స్వసురాప్తానాం, వధాచ్చ ధనదానుజః
రామేణ నిహితం మేనే పదం దశసు మూర్ధసు".

అర్థము:—ఖరాదిరాక్షససంహార మైనపిదప రావణునకుఁ గలిగినభావము; స్వసుః=సోదరియొక్క, నిగ్రహాత్=కర్ణాదిచ్ఛేదనమువలనను, ఆప్తానాం=ఆప్తులయొక్క, వధాత్ చ=వధవలనను, ధనదానుజః=కుబేరునిసోదరుఁ డగు రావణుఁడు, రామేణ = రామునిచేత, దశసు, మూర్ధసు=తలలు పదింటియందును, పదం=పాదమును, నిహితం=ఉంచఁబడినట్లుగా, మేనే=తలఁచెను.

రావణునియొకతలయందు రామపాద మున్నను రావణునకుఁ బరాభమే యగును. తలలు పదింటియందును, రామపాద మున్నట్లే రావణుఁడు భావించుటచే నాతనిపరాభవమునకు మేరయే లేదను భావమిచట వర్ణ్యము.—స్వసుః=అని యేకవచన ప్రయోగముచే, తనకున్న యొక్క సోదరికిఁ బరాభవము జరిగినది అని తెలియుచున్నది. 'ఆప్తానాం' అను బహువచనము,ఆప్తులందఱును జనిపోయినా రను భావమును దెలియఁజేయును. 'దశసు' 'పదింటియందును' అనుటచేఁ బరాభవము యొక్క సాకల్యము గోచర మగును. "దశమూర్ధసు" అని సమాస మున్నచో, 'దశ' (పది) సంఖ్యకుఁ బ్రాధాన్యము భాసించెడిదిగాదు. అపుడీ పరాభవాతిశయముగూడ వ్యంగ్య మయ్యెడిదికాదు. ఇట్లు ద్విగుసమాసమునందుఁగూడ సమాసాసమాసకృత మగు నర్థభేద మున్నదని తెలియుచున్నది.

సట్ సమాసమున కుదాహరణములు :—

"నవజలధర స్సన్నద్ధోయం నదృప్త నిశాచరః" మొదలగు

పద్యములు ప్రసజ్యప్రతిషేధ విచారమునం దింతకుం బూర్వమే ప్ర
తము లైనవి,

ప్రత్యుదాహరణము :—

"వాచ్యవైచిత్ర్యరచనాచారు వాచస్పతేరపి
దుర్వచం వచనం తేన బహు, తత్రాప్యయ మనుక్తవాన్".

అర్థము:—(ఎందువలననే విషయమున) వాచస్పతేరపి=బృ
స్పతికిఁగూడ, వాచ్యవైచిత్ర్య రచనాచారు, వచనం, = వాచ్యార్థ
మొక్క వైచిత్ర్యము ప్రధానముగ నుండు రచనముచే మనోహరమ
నుండునట్లు చెప్పుట, దుర్వచం=శక్యముకాదో, తేన=ఆకారణము
తత్ర=ఆవిషయములో (అయమ్) అపి=ఇతఁడుగూడ,బహు=ఎక్కువ
అనుక్తవాన్=మాట్లాడలేదు.

ఇచ్చట 'అనుక్తవాన్' అని చెప్పుటకు బదులు 'నోక్తవా
అని యున్నచో బాగుండెడిది. నిషేధమునకుఁ బ్రాధాన్యము భాసించెడి

తత్పురుషసమాసకర్తృపదోదాహరణము :—

తత్పురుషసమాసమునందుఁ గర్తృవాచకపదము వ్యస్తమ
నున్నందువలన సౌచిత్యము కలుగు నను విషయ మీ క్రింది పద్య
నందు గమనింపవచ్చును.

"దేశః సోఽయ మరాతిశోణితజలైః యస్మిన్ హ్రదాః పూరితా
క్షత్రాదేవ తథావిధః పరిభవ స్తాతస్య కేశగ్రహః
తాన్యేవాహితశస్త్రఘస్మరగురూ ణ్యస్త్రాణి భాస్వన్తి మే
య ద్రామేణ కృతం తదేవ కురుతే ద్రోణాత్మజః క్రోధనః

అర్థము—అశ్వత్థామవచనములు :—

యస్మిన్=ఏదేశమునందు, అరాతిశోణితజలైః= శత్రువుల
మనెడు జలముచే, (పరశురామునిచేత) హ్రదాః=సరస్సులు, పూరితా
నింపఁబడినవో, సః దేశః,అయం=ఆ దేశ మిదియే;తథావిధః=అటువ

కార్తవీర్యార్జునునికుమారులు జమదగ్ని నేవిధముగాఁ జుట్టుపట్టి లాగి పరాభవించినారో యటువంటి) కేశగ్రహః=జుట్టుపట్టిలాగుట యనెడు, పరిభవః=అవమానము, తాతస్య=నాతండ్రియగు ద్రోణునకు, క్షత్రాదేవ=క్షత్రియుఁ డగు ధృష్టద్యుమ్నునినుండియే (జరిగినది); అహితశస్త్రఘస్మరగురూణి = శత్రువులయొక్క శస్త్రములను నాశనముచేయుట యందు గొప్పశక్తి గలిగినట్టియు, భాస్వన్తి=ప్రకాశించునట్టియు; మే, అస్త్రాణి=నాయొక్క అస్త్రములు, తాన్యేవ = ఆపరశురామునకున్న బ్రహ్మాస్త్రములే; క్రోధనః=కోపముగల ద్రోణాత్మజః=ద్రోణునిపుత్రుఁడు, (నేను) రామేణ=పరశురామునిచే, యత్ కృతం=ఏమిచేయఁబడినదో, తదేవ=ఆపనియే, (క్షత్రియనాశనమునే) కురుతే=చేయుచున్నాఁడు.

ఇచట 'రామేణ' అను తృతీయావిభక్తిపదమునందు, రాముని కర్తృత్వము భాసించుచున్నది. "రామేణకృతం" అనుపదములకు, రామకర్తృక మగు కృతి యని యర్థమువచ్చును. కావున రామకర్తృత్వ మనునది కృతిలోనికి విశేషణరూపమున నన్వయించును. అది యిట్లు న్వయించినపుడే, పరశురామునియందలి దారుణతాతిశయరూప మగు యుత్కర్షమును దెలియఁజేయును. ఈ యుత్కర్షాతిశయము, రౌద్రరస పరిపోషకముగ నుండును. పరశురాముఁడు నిరతిశయశౌర్యశాలి యనియు; మహాభయంకర మగు నిర్దయత యతనిలో నూ పొందిన దనియు, సర్వజగత్ప్రసిద్ధమైనవిషయమే. ఇన్ని భావములకు సూచకముగ నుండు 'రామేణ మను పదమునందలి విశేషణత్వము ప్రధానమైన దనుట నిస్సందేహము. ఆ ప్రాధాన్యము భాసించుటకయియే 'రామకృతం' అని సమాసమును చేయక, "రామేణకృతం" అని వ్యస్తప్రయోగ మాశ్రితమైనది.

ఇపుడు కర్తృవాచకమై, వాచకమై, విశేషణరూపము నన్వయించు నొకపదముమాత్రమే యున్న యుదాహరణమును బరిశీలించినాము. కర్తృవాచకపదములు కాని, మిగిలిన కారకవాచకపదములు

గాని యనేకములు, సమాసముగ, విశేషణభావమును దెల్పున
నుండుచో, నపు డా ప్రయోగము ద్వంద్వసమాసమునకు సంబంధి
నదిగ నుండును. ద్వంద్వసమాసవిచారము సేయునపు డా విశేషణ
లకుఁ గల ప్రాధాన్యాప్రాధాన్య విచారణము చేయఁబడును. అంద
ననేకవిశేషణము లున్న యుదాహరణము నిచ్చట నీయలేదు. విధ్య
వాదభావము గల ప్రయోగములకును, పదములకుఁ గల ప్రాధాన
ప్రాధాన్యములలో భేద మేమియును లేదు. అందుచే నిచట విధ్యనువా
భావము గల యుదాహరణమునుగూడ నీయలేదు.

ప్రత్యుదాహరణము:—

"య స్యావమత్య గురుదత్త మిదం కుఠారం,
డింభో౽పి రామఇతి నామ పదస్య హర్తా"

ఇందులో "గురుదత్త మిదం కుఠారం" అనునది యుదాహ
ణము. ఎవనికి గురువుచే నీగొడ్డలి యీయఁబడెనదో యని యర్థము—
పరశురామునిసేవచే సంతోషించిన యీశ్వరుఁడే— సామాన్య మ
ష్యుఁడు కాఁడు—గొడ్డలిని బరశురామున కిచ్చినాఁ డనుటచేఁ, బరశ
యొక్క మహత్త్వమును, పరశురామునియొక్క యీశ్వరా
గ్రహపాత్రత్వ, మహామహిమత్వములును నిచ్చట వ్యక్తము లగు
న్నవి. గురు (ఈశ్వరుఁడు) పదమే యీయర్థోత్కర్షకు మూలము.
యిచట నట్టి గురుపదము, 'గురుదత్తం' అను సమాసములో సంత
నము నొంది తన ప్రాధాన్యమును గోల్పోయినది. "గురుణాదత్త
అని యున్నచో బాగుండెడిది.

కర్మకారకమున కుదాహరణము:—

కృతకకుపితైః బాష్పాంభోభిః సదైన్య విలోకితైః
వన మసి గతా యస్య ప్రీత్యా ధృతాపి తథాంబయా
నవజలధరశ్యామాః పశ్యన్ దిశో భవతీం వినా
కఠినహృదయో జీవత్యేవ ప్రియే స తవ ప్రియః"

అర్థము :—ప్రియే=ప్రియురాల వగు నో సీతా! అంబయా=తల్లియగు, కౌసల్యచేత, తథా=అవిధముగ, ధృతాపి=అడ్డుపెట్టఁబడినను, యస్య=ఏనాయొక్క (నాసంబంధమైన) ప్రీత్యా=ప్రేమచేత, కృతకకుపితైః=కృత్రిమకోపములచేతను, బాష్పాంభోభిః=కన్నీళ్ళచేతను, సదైన్యవిలోకితైః=దీనము లగు చూపులచేతను, (నన్ను వశముచేసికొని) వనమ్=వనమునుగుఱించి, గతా=వెళ్ళినదానవు, అసి=అయితివో, సః=ఆ, తవ, ప్రియః=నీకు ప్రియుఁడగునట్టియు, కఠినహృదయః=కఠినహృదయుఁ డగునట్టియు రాముఁడు, భవతీంవినా = నీవులేకుండగనే, నవజలధరశ్యామాః = క్రొత్తమేఘములచే నల్లనైన, దిశః = దిక్కులను, పశ్యన్=చూచుచు, జీవత్యేవ = జీవించియేయున్నాఁడు.

ఇచ్చట సీతా కర్తృకమైన గమనక్రియకు "వనం" అనునది కర్మ. వనకర్మక మైన గమన మనుటచే, వనము విశేషణమైనది.—ఈ విశేషణము, (వనకర్మకగమనకర్త్రియగు) సీతకుత్కర్షను గలిగించును. వనవాసదుఃఖ మతి కష్టము—అట్టి వనవాసదుఃఖమున కంగీకరించుటచే సీతకు శ్రీరామునియం దతిశయ మగు ప్రేమ యున్న దనియు నితర స్త్రీలు చేయలేని దుష్కరకార్యము నామె యొనర్చిన దనియుఁ దెలియుచున్నది. ఈ భావము లన్నియును సీత కనితరస్త్రీసాధారణ మగు మహత్త్వము నాపాదించును. ఈ మహత్త్వభావనము, రామునియందలి రతి కుద్దీపనవిభావ మగుచున్నది. ఇట్లు వన మను కర్మవాచకపదము రసపోషణమునఁ బ్రధానమై యొప్పుచున్నది. అట్టి 'వన' పదమును 'గతా' యను పదముతోఁ గలిపి "వనగతా" యని సమాసముఁ జేయకుండుటయే యుచితము. సమాసముఁ జేసినచో మన మిప్పు డనుకొనిన చమత్కారాతిశయ ముదయించెడిది కాదు.

మఱియొక యుదాహరణము—"గుర్వర్థ మర్థీ, శ్రుతపారదృశ్వా రఘోస్సకాశాత్ అనవాప్య కామమ్"

గద్య

ఇది శ్రీ రాజగోపాలకరుణాకటాక్షవీక్షణానుక్షణ ప్రవర్ధమాన సా
సా(ర)స్వత ధురీణయు, విచిత్ర పత్రికాశత లిఖిత వాచికార్థావగాహ
ప్రవీణయు, తత్ప్రతిపత్రికాశత స్వహస్తలేఖన ప్రశస్త కీర్తియు,
శృంగార రస తరంగిత పద కవిత్వ మహనీయ మతిస్ఫూర్తియు,
అతులితాష్ట భాషా కవితా సర్వంకష మనీషా శారదయును,
రాజనీతి విద్యా విశారదయును, విజయరాఘవ మహీపాల
విరచిత కనకాభిషేకయు, విద్వజ్జనకవిస్తవనీయ వివే
కయు, మన్నారుదాస విలాసనామ మహాప్రబంధ
నిబంధన కృతలక్షణయు, మహనీయ రామాయణ
భాగవత భారత కథాసంగ్రహణ విచక్షణయు,
పసపులేటి వేంకటాద్రి బహుజన్మ తపఃఫలం
బును, మంగమాంబాగర్భ శుక్తి ముక్తా
ఫలంబును, రంగద్గుణ కదంబయు నగు
రంగాజమ్మ వచన రచనా చమత్కృతిం
జెన్నుమీఱు "ఉషా పరిణయం"
బను మహా ప్రబంధము నందు
ప్రథమాశ్వాసము
స మా ప్త ము.

ఉషాపరిణయము

ద్వితీయాశ్వాసము

క॥ శ్రీ జయ నిత్య నివాసా!
భూజనపాలన వదాన్యభూజ! మహోద
గ్రాజి ధనంజయ! దశది
గ్రాజిత గుణహారి! విజయరాఘవశౌరీ!

వ॥ అవధరింపుము.

క॥ అని పలుకు చెలులపలుకులు
విని కన్నియ సమ్మతింప వేడ్కలు మదిలోఁ
దనరఁగఁ దమదమ యుడిగము
లను పొందఁగఁ జేయఁబూని రా చెలు లంతన్.

సీ॥ పణఁతి యొక్కతె చేరి బంగారుపావలు
పదములఁ గీలించె బాగుమీఱ
చెలియ యొక్కతె చేరి శృంగార మమరంగఁ
గై దండ యొసఁగెను ఘనత మెఱయ
సకియ యొక్కతె చేరి సరిగంచుపనిచీర
నెఱిచక్కఁగా దిద్దె సీటుగుల్క
కొమ్మ యొక్కతె చేరి కొనగోళ్ల చేతను
గురులు నున్నఁగ దువ్వె కొమరుమించ

తే॥ అతివ యొక్కతె పనిహార్యఁహారిగ పట్టె
పొలఁతి యొక్కతె యడపంబు పొసఁగఁబట్టె
సుదతి యొక్కతె కపురంపు సురటి విసరె
రమణి యొక్కతె వింజామరంబుఁ బూనె.

వ॥ మఱియును-

సీ॥ దండె తంబుర స్వరమండలంబు రబాబు
వేటుగజ్జెలు ముఖవీణె ఢక్క-
చెంగు కామాచి యుపాంగంబు కిన్నెర
వీణియు తాళంబు పిల్లఁగ్రోవి
చిటితాళము రమయు శేషనాదంబు రా
వణహస్తమును జంద్రవలయములును
మురజంబు నావజంబును మొదలుగఁ గల్గు
కమనీయ వాద్యముల్ గరిమఁ దాల్చి

తే॥ రంగురక్తులు గులుకంగ రాజముఖులు
ముంగలను జేరి త్రిభువనమోహనముగఁ
జెలఁగి సంగీతమేళంబు సేసి కొలువ
వేడుకలు మీఱ నెంతయు విభవ మలర

సీ॥ పదపద్మములచాయ బాఱిన మొడలను
బఱచిన చెంగావి బాగు మీఱ
నెమ్మనికాంతులు నిండిన దిశలను
బంగారుమనువ్రాఁతరంగు కులుకఁ
కలికిలేఁజూపులు గలిగిన బయటను
గలువతోరణములచెలువు మెఱయ
నెఱికొప్పుబలుకవ్వ నిగ్గు దోఁచిన చోట్ల
నీలముల్ వెదజల్లు నీటు దనర.

తే॥ బాణనందన యైనట్టి పద్మగంధి
మందయానలు గొలువంగ నందముగను
మనసు నాథునిపై. నిల్పి మచ్చికలర
వన్నె మీఱిన యుద్యానవనముఁ జేరె.

వ. అప్పుడు-

క॥ రామా! రమ్మని చెలులా
రామంబును జూడఁ దలఁచి రమణీయవచ
(శ్రీ) మెఱయఁ బలికి రీ గతిఁ
గోమలికిని బ్రొద్దు పుచ్చ గోరికతోడన్.

సీ॥ పరిమళంబుల నించు పసిఁడికైవడి నించె
సంపెఁగల్ చూచితె సరసిజాక్షి !
పంచబాణునికీర్తి పగిది రాణించెను
బొండుమల్లెలు చూడు పువ్వుఁబోఁడి
వనలక్ష్మి స్రమౌక్తిక వనహార మన మీఱె
పొన్న మొగ్గలు చూడు పుష్పగంధి!
ఒప్పారె ధరసేసకొప్పుచందంబున
సేవంతులను జూడు చిగురుఁబోఁడి !

తే॥ మాధవునికొల్వుకూటాలమాడ్కిఁ దనరెఁ
గన్నె! చూడుము పుప్పొడితిన్నెలిచట
ననుచుఁ జెలి నెచ్చరించుచు హర్షమునను
వనవిహారంబునకుఁ బూని వనజముఖులు

రగడ

జలజాక్షి! చూచితే! సరవిఁ గనకము లిందు
తొలఁగె నళులెల్లను దూరముగ నిటులిందు

చెలియ(రో!)పలుమాఱు చేయకుము [1] వాదులను
వెలయేల! కైకొనుము వేగ విరవాదులను
కొమ్మ! యీ విరిబంతి కొనఁగ నా చెలితరమె
తుమ్మెదలు ఝంకృతులఁ బోలఁగ నడిగో! [2] తెలిపెం
సుదతిరో! వింతాయెఁ జూడు మిటు నీడలను
మదనునిహజారములమాడ్కిఁ దగె [3] నీడలను
పొలఁతిరో! మకరందముల మీఁత నిదె పొగడ
చెలరేఁగి పలుమాఱు చెల్లదే యిఁకఁ బొగడ
హరిణాక్షి! పరికింపు మచటి కింశుకములను
మెఱుఁగారు విరుల నామెతలు సేసె శుకములను
పారిజాతము చూచి పరువెత్తె మున్న యది
మారునెలగో లిచట మలసి పిక మున్నయది
కంతునకు సర్పింప, గమనజితవేదండ!
వింతగాఁ గూర్చెదను వేగ మీవే దండ
అలరుగుత్తిది దానిదఁట యిమ్ము నీ కేల?
కెలన నున్నది విరుల్ గిల్లు మివె నీ కేల
నగు వారిఁ జూడు మెన్నఁడుఁ గాన మీ వింత
చిగురాకునకు రాఁపు సేతువా నీ వింత
కోరి నేఁ దెచ్చితిని గోరంటవాసనను
ఔర నే నెటు లిత్తు నడిగి దీ వాసనను

---

(1) వాదములు-అని ప్రతిపాఠము. రగడలోని యంత్యప్రాసనియమమును బట్టి యిది వ్రాఁతపొరబా టని తోఁచెడిని.
(2) 'తెలిపెం' క్రియకు వ్యావహారికము.
(3) 'ఈరెమ్మలను' అని యర్థము.
(1) అడిగెదు + ఈవు + అసవ్ + వను. అని విసంధి.

అదిర ! దవ్వుగఁ బోయి యరికట్టె నిది రాఁగ
నెదురుగా విరిసరుల కింతి! యెంతటి జాఁగ

మల్లెమొగ్గలు మీఁద మరునిసెలగోల లన
నెల్లెడలఁ దనచాయ లెనయు నిదిగో లలన

బింబోష్ఠి ! యేనె తగఁ బెంచితి [1] రసాల మును
డంబైనయట్టి సీడల యీ రసాలమును

ఎంత దూరము చనిరొ నెందుకే యీ లేమ
కంతుపూజకు నన్నఁ గనకములె యీ[2] లేమ ?

వేడుకలు నించె నిట వెలఁది! నారంగములు
నాడగా గుంపులై యులరె సారంగములు

అపుర ! బంగరుచాయ నలరె జంబీరములు
యువతి ! నీ కుచము లెనయునె ? వట్టిబీరములు

కురువిందగుత్తి గైకొను మేల జగడంబు ?
పరికింపు దీనికిని ప్రతి యగునె పగడంబు ?

చాలు నిఁక నన లనుచు సరసోక్తులను బెనుచు
బాళి మీఱఁగఁ జాల బాణనందన ప్రోల.

క. వనకేళి సలిపి యీ గతి
నెనసిన తమ మేనిబడలి కెంతయుఁ దీఱ
దనరెడు తామరకొలనికి
వనజేక్షణఁ దోడుకొనుచు వచ్చిరి వేడ్కన్.

సీ॥ తావులు వెదజల్లు తామరవిరి యను
ముద్దులుఁగుల్కు నెమ్మోముఁ దనర
డాలు గల్గినయట్టి వాలుగమీఁ లను
కను సోగలై మించు కన్ను లమర

---

(1) అనురాగరూపనీరములతో—అని యర్థము
(2) ఈఁడులేమ ?—అని యర్థము

మక్కువ గనుపట్టు జక్కవ లనియెడు
కొమరు మీఱిన గబ్బిగుబ్బ లలర
ఒమ్మిగాఁ జెలువొందు తుమ్మెదగుం పను
కప్పు మీఱిన గొప్ప కొప్పు మీఱ
తే॥ గీ॥ హంసగమనంబు లను గతు లతిశయిల్లఁ
దరఁగ లనియెడు బాహువు లెసరఁ జాచి
సరసి యనియెడు చెలికత్తె సంభ్రమమున
బాణతనయ నెదుర్కొనె భావమలర.

క. ఒక రొకరిచేయి గ్రుచ్చుక
పకపక నవ్వుచును మిగులఁ బంతము మీఱన్
వికచాబ్జనయన లయ్యెడ
నకలంకం బైన సరసి నాడుచు వేడ్కన్.

సీ॥ ఈఁత యిక్కడ నలి వింతిరో ! రమ్మని
చేరంగఁ బిల్చెను జెలియ యొకతె
చిమ్మనఁగ్రోవులఁ జిమ్మెద వేగమ్మె
యొడ్డించుకొ మ్మనె నువిద యొకతె
నేర్పున నీఁదెద నెలఁత ! యిచ్చోటను
దను జూడు మని పల్కెఁ దరుణి యొకతె
కలువపువ్వులు గోసి కలికి ! నీ కిచ్చెద
వెన్నంటి ర మ్మనె వెలఁది యొకతె
తే॥ మాటిమాటికిఁ జాఱుగుఁబీఁట లెక్క
సారసాక్షులు కొందఱు జాఱి సారె
నొండొరులమీఁద జలములు నిండుకొనఁగఁ
జల్లు లాడిరి సరసిలో సరసముగను

సీ॥ ఒప్పైన కురులకు నోడిపోయినయట్లు
తుమ్మెదగుంపులు తొలఁగఁబాఱ
స్తనయుగ్మములకును సరి రా మనెడులీలఁ
జక్రవాకంబులు సరగ నెగసె
గమనంబులకుఁ గుంది కడ నుండుకై వడి
నంచలు పార్శ్వాల నణఁగియుండె
కనుదోయితో సాటి గాంచలే మనురీతి
జలములలోఁ దాఁగె సారెమీలు

తే॥ కోమరు మీఱు కరేణువుల్ గొలను జొచ్చి
మించి వేడుకతో విహరించునట్లు
బాణనందనఁ గూడి య ప్పద్మముఖులు
సరసిలోపల జలకేళి సల్పునపుడు

క॥ ఇ వ్విధమున విహరించిన
జవ్వను లందమునుగూడి సంతస మమరన్
పువ్వులబోణిని దోడుక
నవ్వుచు గట్టెక్కి వచ్చి నై పుణి మీఱన్

ఉ॥ బొమ్మలపట్టుకోకలను
బొంకము మీఱఁగఁ గప్పి, మేలిమా
సొమ్ములు మేనఁ దాల్చి కడు
సొంపమరన్ జడ లల్లి వింతగా
నెమ్మిని గీటునామములు
నీటుగ దిద్దుచుఁ, దీపమేనులన్
గమ్మజవాదివాసనలు
ఘుమ్మని మీఱ నలరది వేడుకన్

క॥ బటు వగు మామిడిక్రిందను
గుటిలాలక మదిని మించు కోర్కులు వెలయన్
స్ఫుటముగ మదనుని భావము
పటమున లిఖియించి తెచ్చి ప్రమదము మీఱన్

క॥ పుష్పాదిని దిన్నె దీర్చుచు
నొప్పుగ మృగనాభి యలఁది యొదవిన వేడ్కన్
కప్పురవుముగ్గు లిడుచును
దెప్పలుగాఁ దమ్మివిరులు దెచ్చుచు మఱియున్.

సీ. ప్రతిలేని రతనాల పండ్లెంబులోపల
గంధంబు కుంకుమ కస్తురియును
పసిఁడియక్షతలును బంగ్లు టెంకాయలు
పన్నీరుచెంబులు బాగుమీఱు
కపురంపుబాగాలు కలువపూబంతులు
మొగలిరేకులు మంచిమొల్లవిరులు
కురువేరు దవనంబు గొజ్జఁగ సరులును
బొండుమల్లెసరాలు పొన్నపువులు

తే॥ గీ॥ మొదలుగాఁ గల వస్తువుల్ ముదము మీఱ
తెచ్చి ముందఱ నవరించి తేజ మమర
పచ్చవిల్తుని నచ్చటఁ బరగ నిల్పి
బాణనందనఁ దోడ్తెచ్చి బాగుమీఱ

సీ॥ ధ్యానంబు నారాయణాత్మసంభవునకు
నావాహనంబు రత్యాప్తునకును
సింహాసనంబు రాచిల్కతేజీరౌతు
కర్ఘ్యంబు వారిచరాంకునకును

పువ్వులదుప్పటి పూవింటిజోదునకు
గంధంబు మలయూశుగప్రభునకు
నలరుదండలు కుసుమాకరసఖునకు
ధూపంబు భూరిప్రతాపునకును
దీప మఖిలానురాగప్రదీపునకును
సరసనైవేద్య మిది యిక్షుచాపధరున
కనుచు వివిధోపచారము లాచరించి
య య్యుపాసకన్య ప్రమొక్కించి యందముగను.
అఖలజగన్మయుం డైనట్టి హరియును
శ్రీసతి నెద నుంచెఁ జెలువముగను
సకలంబు సృజియింపఁ జాలినబ్రహ్మయు
వాణిని నెలకొల్పె వదనసీమ
నతిశౌర్యుఁడై యుండునట్టి ముక్కంటియు
సామేన నుంచెను సతిని ప్రేమ
నల పరాశరమౌనియంతటివాఁడును
మత్స్యగంధిని గూడె మమతచేత
నితరు లన నెంత? నీ దాడి కెంచి చూడ
నీకు నెన యెవ్వరయ్య? త్రిలోకములను
బాల యెటువలెఁ దాళు నీ బాణములకుఁ
గన్నఁ గావుము మదన! నీ కరుణచేత
అని సన్నుతించి య క్కన్నియ చేత ప్రమొక్కించిన.
కుతుకము మీఱఁగ నా మది
చతురతఁగలఁగలిసినట్టి సరసగుణాఢ్యుఁ
బతి సేయు మనుచుఁ గోమలి
రతిరాజును వేడుకొనియె రంజిలుభక్తిన్

వ. అంత

క॥ అరుదగు తన పతినామము
తిరముగ ధరియించునట్టి తెలివకు నింకన్
పరితాపం బిడరా దని
ఖరకరుఁ డస్త్రాద్రిఁ జేరెఁ గనికర మొప్పన్.

మ॥ కమలంబుల్ ముకుళించె భృంగములఝుం
కారంబు తోరంబుగాఁ
కుముదశ్రేణులయందు మించె; ఖగముల్
గూఁడుల్ వడిన్ జేరె; సం
తమసంబుల్ దిశలందుఁ జేరెఁ; గడు వం
తన్ గుందెఁ జక్రావలుల్
కమనీయద్యుతిఁ జెందెఁ దారకలు నా
కాశంబునం దీరుగన్

సీ॥ చీకటు లనియెడు సింధురశ్రేణులఁ
జెండాడ వచ్చిన సింహ మనఁగ
నమరులు మథియింప నల క్షీరవారిధి
వెలువడి కనుపట్టు వెన్న యనఁగ
దూర్పుదిక్కనునట్టి తొయ్యలి ధరియించు
మురువైన ముంగెరముత్తె మనఁగ
వెలిదీవిలో నున్న వెన్నునిసన్నిధిఁ
బట్టిన పలువగల్వత్తి యనఁగ

తే॥ గీ॥ వెలయఁగఁ జకోరకముల కెల్ల విందుచేసి
కువలయామోద మొనరించి కొమరుమీఱి
కూడియుండెడి విటులకుఁ గోర్కె హెచ్చ
చంద్రుఁ డుదయించె సత్కాంతిసాంద్రుఁ డగుచు.

వ. అట్టి సమయంబున

క॥ బల్లిదుఁడై మొల నరవిరి
చల్లడముఁ జివ్వురుదట్టి సవరించి తగన్
మల్లెవిరి బొమిడికం బిడి
మొల్లజిరా దొడిగి మిగుల మోదముతోడన్.

సీ॥ చెలరేఁగి మెలదేఁటి మెలగోలు మూకలు
దులదుల మునుమున్ను దుముకు లిడఁగ
దండిమై రాయంచ దండిబారా వెంట
మెండుగా నెల్లెడ నిండి నడవ
నిరువంకలను జేరి గోరింకమున్నీలు
బలుబింకములతోడఁ బ్రబలి కొలువ
గుంపు గూడుక గండుకోయిలమాష్టీలు
వెన్నాని కైమదోద్వృత్తి రాఁగ

తే॥ గీ॥ చిఱుపతెమ్మెరదళవాయి సరసఁ జెలఁగ
తేజ మమరంగ రాచిల్క తేజి నెక్కి
తమ్మిదోదుమ్మి కలువకేడెమ్ముఁ బూని
తలిరువిలుకాఁడు బోఁటిపై దాడివెడలె.

ఉ॥ పాయని భీతిఁ బాంథులకు
భగ్గున గుండెలు బెగ్గటిల్లఁగాఁ
గోయిల లంటి వెంటఁ జని
కో యని యార్వఁగ, జంట తుంటవిల్
రాయలు తమ్మికైదువ ఝు
రా యని దూయుచు దొమ్మి కొమ్మపై
ధే యని కల్కిరాచిలుక
తేజిని నూకె దువాళి మొప్పఁగ

క॥ ఆయెడ వలరాయఁడు బలు
రాయిడి కెందమ్మిజిగిక రాచూరులచే
నాయమ్ములు గాయమ్ములు
చేయఁగ మదిరాక్షి బెగడెఁ జిత్తములోఁగ.

క॥ కలఁ గలసిన యల చెలువుని
చెలువము తమి నెంచ నెంచఁ జిత్తములోఁగ
వెలి విసరె సత్త్వసంభవ
లలితవికారంబు లపుడు లజ్జావతికిఁ.

చ॥ సరసిజపత్రనేత్రి కల
చందము డెందములోనఁ బూని వ
ల్మరు మరుచూలి యేలిన క్ర
మంబు గణించ మరుందు సించఁగా
గఱులకు గాఁడి వాఁడి సరి
కట్టిన కల్వలకోరిచాలు మే
మురువున రూపుమై పులక
ముల్ బొరసెన్ మొరసెఁ ద్విరేఫముల్.

చ॥ సలలిత మైన చందనము
చాయను మాయఁగఁజేసి కప్రపుం
బలుకులతళ్కు పూఁత నగు
బా టొనరింపుచు గబ్బిగుబ్బలఁ
నెలకొను సిబ్బెపుస్నెలుఁగు
నీటును మాటు ననంగపాండిమల్
బలవడె నింతిమేనఁ గుసు
మాయుధకీర్తి సమానమూర్తియై.

సీ॥ మించుమొగ్గలను రాణించు ఠీవియు నీన
డించు చెల్వంబు వరించ నెంచి
డంబుముత్తెపుఁజక్కఁడంబుడాల్మరుని బె
త్తంబు నేర్మెఱుఁగుమొత్తంబుఁ దాల్చి
యొనపరిమంచుచే నెసఁగు తొల్కరివిప్పు
పసిఁడిగేదఁగిఱేకుమిసిమిఁ దెగడి
చిలుపనీటను బొందు నిలువఁబోలు మెఱుంగు
మలపఁజాలు తెఱంగు తెలుపుమీఱి

తే॥ గీ॥ మెఱయు చిఱుచెమటూనిన మేనఁ బాన
యుల్లసిలువల్లభునియెద నుండునట్లు
డాలువాలుగదొరవూలకోలలేటు
నాటి సాత్త్వికభావంబు తేటపఱుప.

తే॥ గీ॥ వనజముఖి యోరి ! యబల యయ్యును జగత్ప్ర
సిద్ధు ననిరుద్ధుఁ దనలో నిరుద్ధుఁ జేయ
బద్ధవైరంబు మరున కా భ్రమరకచకు
దానిచే నయ్యె; సుతునకై పూనుకొనరె !

చ॥ కనుతెఱఁ గొప్పియుఁ గనదు,
గాంచు గణించఁగఁ బారవశ్యముఁ
వినుతిక నెక్కు నామధుర
వృత్తి వహించియు మాటలాడ దా
మునుకొని యట్టివారలకు
మోహ మొనర్చును గాఁక కిమ్మగిఁ
గనుఁగొన భేదమా ? కలువ
కంటికి మారుని తుంటవింటికిఁ.

క॥ కలకల నవ్వుచు నుండుఁ
బలుమాఱును దిశలు చూచు భ్రమయుచునుండుఁ
నిలిచిన చోటను నిలువదు
కలకంఠికి విర (హ) మెంత ఘనమో యకటా !

వ. యివ్విధంబున

క॥ మరుశాఁకల భ్రమ నొందుచుఁ
బరువడి నునునునుర మనుచు భామిని మదిలో
వరునిం దలఁపుచు నుండఁగ
వెఱఁ గందుచు నెక్కసకియ వెలఁదుల కనిరోఁ.

సీ॥ అతివ! దాఁగిలిమ్రుచ్చు లాటలాడుద మన్న
సమ్మతించ దొకింత చంద్రవదన
చెండు గోరింతము చెలియ రమ్మనిఁ పిల్వ
గనువిచ్చి చూడదు కలువకంటి
గుజగుజరేకులఁ గొమ్మ ! యాడుదమన్న
మోమెత్తి చూడదు ముద్దుగుమ్మ
పగడసాల మనము పడఁతి యాడుద మన్నఁ
బలుకదు మనతోను బద్మనయన

తే॥ గీ॥ అతివ ! చదరంగ మాడుద మనుచుఁ బిల్వ
నించుకంతయు సంగీకరించదయ్యె
ననుచుఁ దమలోన వగచుచు నతివఁ జేరి
మరునితాపంబు చల్లార్చు మనసుతోడ.

సీ. చాణనందనకప్పు పణఁతు లందఱుఁ గూడి
శైత్యోపచారముల్ సలుపగోరి

చిగురాకుపాన్పుపైఁ జెలియ నొయ్యన నుంచి
పూలదుప్పటి మేనఁ బొసఁగఁ గప్పి
కపురంపువాసనల్ ఘుమ్మన వాసించు
చెలువగందము పూసి చెలువుమెఱయ
పన్నీటఁదడిసిన పావడచేతను
మొగమునం దదియొత్తి మోద మమర.

తే॥ కలువపూవులబంతులు కన్నదోయి
మాటిమాటికి నొత్తుచు మమత మీఱ
పూలసురటుల విసరుచుఁ బొంకముగను
మరునితాపంబు చల్లార్చ మగువ కపుడు.

సీ. చెలువుమీఱినయట్టి చిగురాకు పానుపు
చిగురువిల్తునివాఁడి చిలుకు లయ్యెఁ
బొసఁగంగఁ గప్పిన పువ్వులదుప్పటి
పంచబాణుని బాణపంక్తు లయ్యెఁ
గన్నుల హత్తించు కలువపువ్వులబంతి
వలరాజుమొల నున్న వంకియయ్యెఁ
దనువున నించిన తామరతూఁడులు
కుసుమసాయకునిలకోరు లయ్యె

తే॥ జెలులు గావించు నుపచారములె తలంప
మనసిజుని సాధనంబులై మనసులోనఁ
దోఁచుచుండంగ విరహంబు ద్రోయలేక
యేమిఁ సేయుదు నెట్లోర్తు నే నటంచు.

చిగురాకుపాన్పుపైఁ జెలియ నొయ్యన నుంచి
పూలదుప్పటి మేనఁ బొసఁగఁ గప్పి
కపురంపువాసనల్ ఘుమ్మన వాసించు
చెలువగందము పూసి చెలువుమఱయ
పన్నీటఁదడిసిన పావడచేతను
మొగమునం దడియొత్తి మోద మెసఁగ.

తే॥ కలువపూవులబంతులు కన్నదోయి
మాటిమాటికి నొత్తుచు మమత మీఱ
పూలసురటుల విసరుచుఁ బొంకముగను
మరునితాపంబు చల్లార్చ మగువ కపుడు.

సీ. చెలువుమీఱినయట్టి చిగురాకు పానుపు
చిగురువిల్తునివాఁడి చిలుకు లయ్యెఁ
బొసఁగంగఁ గప్పిన పువ్వులదుప్పటి
పంచబాణుని బాణపంక్తు లయ్యెఁ
గన్నుల హత్తించు కలువపువ్వులబంతి
వలరాజు మొల్ల నున్న వంకియయ్యెఁ
దనువున నించిన తామరతూఁడులు
కుసుమసాయకునిలకోరు లయ్యె

తే॥ జెలులు గావించు నుపచారములె తలంప
మనసిజుని సాధనంబులై మనసులోనఁ
దోఁచుచుండంగ విరహంబు ద్రోయలేక
యేమిఁ జేయుదు నెట్లోర్తు నే నటంచు.